

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు
బోనకల్ క్రీడాకారులు 6

ఉమ్మడి జిల్లా స్థాయి
ఖోఖో జట్ల ఎంపికలు 7

నాణ్యతతో పనులు పూర్తిచేయాలి

- సీఎం పర్యటన నేపథ్యంలో ఎర్త్‌సైన్స్ పనులు పరిశీలించిన భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి సంబంధించి చేపట్టిన పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. డిసెంబరు మొదటివారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీని ప్రారంభించనున్న నేపథ్యంలో చేపట్టిన పనులను ఆయన గురువారం పరిశీలించారు. యూనివర్సిటీ క్యాంపస్ మొత్తం కలియదిరిగిన కలెక్టర్ అకడమిక్ బ్లాక్ రిపేర్ వర్క్స్, ఆడిటోరియం మరమ్మతులు, బాలుర కామన్ మెస్, బాలికల హాస్టల్ పనుల పురోగతిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. ఆడిటోరియంలో మౌలిక వసతులు, సీటింగ్ ఏర్పాట్లు, స్టేజీ సెటప్, లైటింగ్, ఎలక్ట్రికల్ పనులు లాంటివన్నీ నాణ్యతతో పూర్తవ్వాలని ఆయన సూచించారు. యూనివర్సిటీ పాత, కొత్త భవనాల సుందరీకరణ, పార్కింగ్ ప్రాంతాల అభివృద్ధి, క్యాంపస్ పరిశుభ్రత పనులను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రారంభ శిలాఫలకం ఏర్పాట్లను కూడా పరిశీలించి, దాని వద్ద ఏర్పాట్లు ఆకర్షణీయంగా, సముచిత ప్రమాణాలతో ఉండాలన్నారు. విద్యార్థుల వసతి గృహాల్లో ఫర్నిచర్ అమరిక, నీటి సదుపాయాలు, శౌచాలయాల మరమ్మతులు, వసతి ప్రాంతాల పరిశుభ్రత లాంటి అంశాలను ఆయన సమీక్షించారు.

క్యాంపస్ ఆవరణ మొత్తం పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు నాటడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.జగన్మోహన్ రాజును ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రారంభోత్సవం జిల్లాకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని, విద్యారంగంలో జిల్లాకు ఇది ఒక ప్రధాన మైలురాయి అవుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అన్ని శాఖల సమష్టి బాధ్యతన్నారు. అధికారులు అత్యంత వేగం, శ్రద్ధతో పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మునిసిపల్ కమిషనర్ సుజాత, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్‌కు సహకారం

పంట సాగు విస్తరణలో సహకార సంఘాల భాగస్వామ్యం

- ఉమ్మడి జిల్లాలో 97 సొసైటీలకు 130ఎకరాల చొప్పున లక్ష్యం
- ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 29వేల ఎకరాల్లో విస్తరణకు కార్యాచరణ

అశ్వారావుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగు విస్తరణలో ఇకపై సహకార సంఘాలు భాగస్వామ్యం కానున్నాయి. రాష్ట్రంలో వచ్చే మార్చి వరకల్లా 1.20 లక్షల ఎకరాల్లో పామాయిల్ తోటల విస్తరణను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్య సాధన కోసం వ్యవసాయ అనుబంధ శాఖలన్నింటినీ భాగస్వామ్యులుగా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రాథమిక సహకార సంఘాలను భాగస్వామ్యం చేయడం ద్వారా పామాయిల్ విస్తరణను మరింత వేగం చేసేందుకు సర్కారు ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు సహకార శాఖ కమిషనర్ ఆయా సంఘాలన్నింటికీ ఆదేశాలు జారీ చేశారు. వచ్చే మార్చినాటికల్లా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 29వేల ఎకరాల్లో పామాయిల్ తోటలను విస్తరింపచేయాలనే లక్ష్యంతో.. ఖమ్మం జిల్లాలోని 97 సహకార సంఘాలకు ఒక్కో సంఘానికి 130 ఎకరాల్లో పామాయిల్ తోటలు వేసేలా రైతులను చైతన్యపరచాలని లక్ష్యాన్ని నిర్దేశిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఉమ్మడి జిల్లాలో 29వేల ఎకరాలు..

ఖమ్మం జిల్లాలో ఇప్పటికే 35వేల ఎకరాల్లో, భద్రాద్రి జిల్లాలో 82వేల ఎకరాలలో పామాయిల్ తోటలు విస్తరించి ఉన్నాయి. వచ్చే మార్చినాటి కల్లా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఒక్కో జిల్లాలో 14,500 ఎకరాలలో మొత్తం 29వేల ఎకరాల్లో పామాయిల్ తోటలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిలో ఇప్పటికే రెండు జిల్లాల్లో కలిపి (మిగతా 6వ పేజీలో)

ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో సొసైటీల సహకారం

జంగాల కిషోర్, ఉద్యానశాఖ అధికారి, భద్రాద్రి జిల్లా



భద్రాద్రి కొత్తగూడెంలో ఇప్పటికే లక్షా పదిహేడు వేల ఎకరాల్లో పామాయిల్ తోటలు విస్తరించి ఉన్నాయి. ఉమ్మడి జిల్లాల్లో వచ్చే మార్చినాటికి 29వేల ఎకరాల్లో విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో ఉమ్మడి జిల్లాలోని 97 సహకార సంఘాల ద్వారా 12,610 ఎకరాల్లో విస్తరించేలా లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆయిల్‌ఫెడ్, ఉద్యానశాఖ, సహకార సంఘాల సహకారంతో లక్ష్యాన్ని సాధించే దిశగా పయనిస్తున్నాం.

జీజీహెచ్‌లో టీఎంటీ సేవలు ప్రారంభం



టీఎంటీ మిషన్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ తదితరులు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న గుండె చికిత్స విభాగంలో టీఎంటీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ మేరకు టీఎంటీ యంత్రాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నరేందర్ ప్రారంభించారు. గుండె పరీక్షల కోసం ఇప్పటికే రూ.7కోట్లతో క్యాత్‌లాబ్ అందుబాటులో ఉండగా, ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలను నిర్వహిస్తున్నారు. గుండెవేగాన్ని కొలిచేందుకు కీలకంగా ఉన్న టీఎంటీ మిషన్ ఇప్పటివరకు అందుబాటులో లేకపోవడంతో దాన్ని కూడా గురువారం ప్రాంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, డాక్టర్ బి.కిరణ్‌కుమార్, గుండె వైద్యనిపుణులు డాక్టర్ సీతారాం నాయక్, నందగిరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జనగణనకు రాష్ట్ర సర్కారు కసరత్తు

- ప్రీ టెస్ట్‌కు మూడు మండలాల ఎంపిక
- పినపాక మండలంలో 30వ తేదీ కల్లా పూర్తి

6

అధికారి తీరుపై మంత్రులకు ఫిర్యాదులు

- వసూళ్ల పర్వంపై అధికార పార్టీ నేతల ఆగ్రహం



రైతులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోండి

- అధిక దిగుబడులను సాధించండి
- రైతులకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల సూచన
- హైదరాబాద్‌లో 'ఎర్త్ సమ్మిట్'కు హాజరు

కొత్తగూడెం వ్యవసాయం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అధిక దిగుబడులు సాధించాలని, తద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ హైటెక్‌సిటీలో జరిగిన రైతు ఎర్త్ సమ్మిట్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పలువురు ఉత్తమ రైతులు పాల్గొన్న సందర్భంగా వారు హాజరై రైతులకు సూచనలు చేశారు. కొత్తగూడెంలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టి.భరత్, ఆదర్శ రైతులు గొట్టిపాటి వెంకటేశ్వరరావు, నర్సిరెడ్డి, పాపారావు, తదితరులు మంత్రులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం పంటలు దిగుబడులు తదితర విషయాలపైన రైతులతో తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క మాట్లాడారు.

కమనీయం.. ఉర్సోత్సవం

- ఇల్లెందులో వెల్లివిరిసిన మత సామరస్యం
- కన్నుల పండువగా జులూస్
- ఆకట్టుకున్న ప్రదర్శనలు

6



పూజలందుకున్న నాగులమీరా



ఉర్సే షరీఫ్ వేడుకలకు వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

సమన్వయంతో పని చేయాలి

- సాధారణ భక్తులకు దర్శనమే ప్రధాన లక్ష్యం
- ప్లాస్టిక్ రహిత భద్రాద్రికి సహకరించాలి
- అధికారులకు భద్రాద్రి కలెక్టర్ జితేష్ ఆదేశాలు
- భద్రాచలంలో 'ముక్కోటి' నిర్వహణపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో పని చేసి ముక్కోటి ఉత్సవాలను విజయవంతం చేయాలని, సాధారణ భక్తులు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఉత్తర ద్వారంలో రామయ్యను దర్శించుకునేలా ఏర్పాట్లు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ జితేష్‌వి పాటిల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గురువారం భద్రాచలం సబ్‌కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ముక్కోటి ఏర్పాట్ల జిల్లాస్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. అధికారులకు నిర్దేశించిన పనులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు దేవస్థానం, రెవెన్యూ, పోలీసు అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. తెప్పోత్సవం, ఉత్తరద్వార దర్శనం బందోబస్తు ఏర్పాట్లను పోలీసు శాఖ చేపట్టాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా నామమాత్రపు ధరలతో సౌకర్యాలు కల్పించే విధంగా లాడ్జి, హోటల్ యజమానులతో సమావేశం నిర్వహించి ధరల నిర్ణయించాలని సబ్‌కలెక్టర్‌కు సూచించారు. ఆలయ పరిసరాల్లో సీసీటీవీలు ఏర్పాటు చేయాలని, భక్తుల వీక్షణకు ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని, హంస వాహనాన్ని తనిఖీ చేసి ధ్రువీకరణ నివేదిక సమర్పించాలని నీటిపారుదల శాఖ ఈఈని ఆదేశించారు. హంస వాహనంలోకి పరిమిత సంఖ్యలో మాత్రమే అనుమతించాలన్నారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా పటిష్ఠ బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు భద్రాచలం, పర్ణశాలలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, ప్రతీ సెక్టార్ పర్యవేక్షణకు జిల్లా అధికారులను నియమించాలన్నారు. భద్రాచలం కరకట్ట తెప్పోత్సవం, వైకుంఠ ద్వార దర్శనం దగ్గర మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం భక్తుల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్లు సరిపడా ఉండేలా చూసుకోవాలన్నారు. భద్రాచలాన్ని పర్యాటక కేంద్రం అభివృద్ధి చేసేందుకు బొజ్జిగుప్ప, బెండాలపాడు, రథంగుట్ట, పగిడేరు ప్రాంతాలను దర్శించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. తెప్పోత్సవం, ఉత్తరద్వార దర్శనం అయిపోయే వరకు వైన్స్ బార్‌షాపులు, బెల్టుషాపులన్నీ బంద్ చేయించాలన్నారు. ఐటీసీ సహకారంతో పంచాయతీ సిబ్బంది గోదావరి బ్రిడ్జిపై వీధిలైట్ల ఏర్పాటు, భక్తులెవరు ప్లాస్టిక్ కవర్లు వినియోగించకుండా చూడాలని, జూట్ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. గోదావరిలో బోటింగ్ పాయింట్ వద్ద లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచి గజ ఈతగాళ్లను సిద్ధం చేసి పర్యాటకులకు నామమాత్రపు రుసుంతో గోదావరిలో విహరించేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమీక్షలో ఐటీడీఏ పీవో బి.రాహుల్, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ విద్యాచందన, దేవస్థానం ఈవో దామోదర్‌రావు, కొత్తగూడెం ఆర్డీవో మధు, డీఎస్పీ సతీష్ పాల్గొన్నారు.

ప్రతీ చిన్నారి చదవాలి.. ఎదగాలి

- ఇదే ధ్యేయంగా అందరం పనిచేద్దాం
- విద్యాశాఖ అధికారుల సమావేశంలో డీఈవో చైతన్య జైనీ



మాట్లాడుతున్న డీఈవో చైతన్య జైనీ

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతీ చిన్నారి చదవాలి.. ఎదగాలి.. ఇదే ధ్యేయంగా అందరం పనిచేద్దామని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ అన్నారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మండల విద్యాశాఖ అధికారులు, జిల్లాలోని కాంప్లెక్స్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మోడల్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసచారి హజరై పలు క్లీన్లినెస్ 5.0 అంశంపై సమీక్షించారు. అనంతరం డీఈవో సమావేశ ఎజెండాలోని ప్రతీ అంశం పైన చర్చించారు. టీచర్లు, విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ అమలు తీరుతెన్నుల పైన, ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ ఎఫ్ఎల్ఎస్ - 2025 -26కు సంబంధించి వివరాలు, నేటినుంచి ప్రారంభమయ్యే అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ సర్వేలో బడి బయట పిల్లల వివరాల సేకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. సర్వే అనంతరం సీఆర్పీలు తమ డేటా నమోదు చేయాల్సిన ప్రబంధ్ పోర్టల్ గురించి వివరించారు. ప్రధానంగా కలెక్టర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జిల్లా ప్రత్యేక కార్యక్రమమైన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ (ఈసీఆర్) కార్యక్రమం గురించి వివరిస్తూ ప్రతీ చిన్నారి ధారాళంగా చదవడం అనేది మన ధ్యేయంగా పని చేయాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా సెక్టోరల్ అధికారులు పెసర ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణ, ప్రవీణ్, రూబీ, పంకజం, డీసీబీ సెక్రెటరీ కనపర్తి వెంకటేశ్వర్లు, విద్యాశాఖ సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, శ్రీనివాసరావు, ఏపీవో శ్రీనివాసరావు, డీఎస్‌వో రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన తయారీ ధరల పెంపు..

- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ
- ఈ నెల నుంచి పెంచిన ధరల ప్రకారం బిల్లుల రూపకల్పన

బోనకల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తయారీకి సంబంధించి కుకింగ్ కాస్ట్‌ను పెంచుతూ పాఠశాల విద్యాశాఖ తగిన ఉత్తర్వులను జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో కొనసాగే భోజన పథకానికి ఇప్పటి వరకు అందిస్తున్న రేట్లను సవరిస్తూ నూతనంగా జీవోను ఇచ్చారు. దీని ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ప్రస్తుతం రూ. 6.19ఇస్తున్నారు. పెరిగిన ధరల ప్రకారం కేంద్రం నుంచి రూ.4.07, రాష్ట్రం నుంచి రూ.2.71 మొత్తం రూ.6.78 ఇవ్వనున్నారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.9.29 నుంచి రూ.10.17కు పెంచారు. 9, 10తరగతుల విద్యార్థులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.11.79 నుంచి రూ.13.17కు పెంచారు. ప్రస్తుతం పెంచిన ధరలు జూన్ నుంచి అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నప్పటికి వాటికి సంబంధించి నిధుల కేటాయింపులు జరిగితేనే ఏరియర్ బిల్లులు చేయడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో పెంచిన ధరల ప్రకారం రెగ్యులర్ బిల్లులను ఈ నెల నుంచి అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు ఎంఈఓలకు పంపాల్సి ఉంటుంది.

అశ్రునివాళి



కీ.శే. పసుమర్తి సుభద్రమ్మ గారు
మరణం: 10-11-2025

మహోన్నతమైన వ్యక్తిత్వంతో కుటుంబ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మా మమతలమూర్తి శ్రీమతి పసుమర్తి సుభద్రమ్మ గారి మరణానికి చింతిస్తూ... దివికేగిన వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు
శ్రీనివాసరావు - సుజాత
రామకృష్ణారావు - పద్మప్రియ

కుమార్తెలు - అల్లుళ్లు
రాచర్ల గోపి - సౌజన్య
గోవర్ధన్ - స్వాతి

మరుదులు - తోటి కోడళ్ళు
పసుమర్తి హనుమంతరావు - సుశీల
పసుమర్తి మోహన్‌రావు - సునీత రాణి

మనుమరాళ్లు
సుజిత - ఆంజనేయ గుప్తా | దీపిక - పవన్ సామ్రాట్
కార్తీక - కృష్ణ భగవాన్ | హారిక - సిద్ధార్థ

పసుమర్తి చందర్ రావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు

పెద్దకర్మ: ది.21-11-2025 శుక్రవారం తిలోదకాలు మరియు ధర్మోదకాలు.
దిష్టబంతి: ది.22-11-2025 శనివారం షోడశము, సపిండీకరణము, ఆశీర్వచనము కల్లూరులోని మా స్వగృహమునందు జరుగును.
ఈ ప్రకటననే కార్డుగా భావించగలరు.



విద్యుత్ సమస్య తీర్చాలని సీఎండీని కోరుతున్న ఎంపీ

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

- ఆళ్లపల్లి, గుండాలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు
- టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీని కలిసిన ఎంపీ బలరామ్

ఆళ్లపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వెనుకబడిన ఆదివాసీ, గిరిజన ప్రాంతాలైన ఆళ్లపల్లి, గుండాల మండలాల్లోని మారుమూల పల్లెల్లో విద్యుత్ సమస్య పునరావృతం కాకుండా వెంటనే పరిష్కరించాలని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ గురువారం ఉత్తరతెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎన్‌పీడీసీఎల్)సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ ఆయన్ను వరంగల్‌ని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో రైతులు, ప్రజలు విద్యుత్ సమస్యతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రెండు మండలాలకు ప్రత్యేకంగా అదనపు సబ్‌స్టేషన్, ఏఈలను ఏర్పాటు చేసి.. గ్రామాల్లో సింగిల్ ఫేస్ కరెంట్, గ్రామాల్లోని రైతులకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ విషయమై సీఎండీ స్పందిస్తూ.. రెండు రోజుల్లో ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో పర్యటిస్తానని తెలిపారు. రైతులకు విద్యుత్ ఇబ్బందులు, ఇతర విద్యుత్ సమస్యలపై పరిష్కారం చూపుతానని ఎంపీకి హామీ ఇచ్చారు.

అధికారి తీరుపై మంత్రులకు ఫిర్యాదులు

- వసూళ్ల పర్వంపై అధికార పార్టీ నేతల ఆగ్రహం
- సత్వరమే చర్యలు తీసుకోవాలని వినతి

వేంసూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలంలోని ఓ అధికారి వ్యవహార్శైలి ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందన్న ఆరోపణలు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల దృష్టికి చేరినట్లు విశ్వసనీయ సమాచారం. అధికార కాంగ్రెస్‌కు చెందిన నేతలు ఆ అధికారి తీరుపై మంత్రులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సంబంధిత అధికారి తనదైన తీరు, ఏకపక్ష నిర్ణయాలతో వ్యవహరిస్తుండడంతో.. ప్రజలతో పాటు తామూ తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు పలువురు అధికార పార్టీ నాయకులు మంత్రుల దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. మండలంలో ప్రత్యేకంగా కొంతమందిని మధ్యవర్తులుగా పెట్టుకొని వారి ద్వారా వ్యవహారాలు నడిపిస్తూ తన వసూళ్లపర్వం కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఊసరవెల్లిలా రంగులు మార్చుకుంటూ ఓ నాయకుడు ప్రతీసారి ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆపార్టీలో చేరి సంబంధిత శాఖ అధికారులతో సత్సంబంధాలు పెంచుకొని మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడని స్థానికంగా చర్చ నడుస్తోంది. ఈ పరిస్థితిని ఆ శాఖలోని కొంతమంది సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ వ్యవహారాలన్నింటినీ అధికార పార్టీకి చెందిన మండలంలోని కొంతమంది నాయకులు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. అదేవిధంగా అధికార పార్టీ నేతలకు ఆ అధికారి పనితీరును వివరించారు. సదరు అధికారి ఈ మండలంలో ఉంటే పార్టీకి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని నేతలు మంత్రులకు వివరించినట్లు సమాచారం. ఇలాంటి అధికారి గతంలో ఈ మండలంలో పని చేసిన దాఖలాలు లేవని వారు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. సత్వరమే సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



విద్యాశాఖ సంచాలకులు నవీన్ చేతుల మీదుగా ఎర్రగుంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌కు సన్మానం (ఫైల్)

ఎందరికో స్ఫూర్తిదాత..

- చిత్తశుద్ధి.. అంకితభావం ఆయన నైజం
- వినూత్న ఆలోచనలతో విద్యార్థుల్లో చైతన్యం నింపుతున్న ఎర్రగుంట ప్రధానోపాధ్యాయుడు ఆనంద్

అశ్వారావుపేట/అన్నపురెడ్డిపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులంటేనే ఏదో వస్తున్నారు, నాలుగు ముక్కలు చెప్తున్నారు.. వెళ్లిపోతున్నారు.. అనే భావన చాలామందిలో ఉంది. కానీ అందరూ అలా ఉండరు.. విధులపట్ల చిత్తశుద్ధితో, అంకిత భావంతో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేసేవారూ ఉన్నారని నిరూపించారు అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉండేటి ఆనంద్‌కుమార్. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పలు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిప్రదాతగా నిలుస్తున్నారు. ఆయన కృషిని గుర్తించిన రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ అక్టోబరు 17న హైదరాబాద్‌లో ఉండేటిని సత్కరించి అభినందించారు.

భిన్నంగా ఆలోచించారు.. గుర్తింపు పొందారు..

ప్రధానోపాధ్యాయుడు ఉండేటి ఆనంద్‌కుమార్ అందరి టీచర్లకంటే భిన్నంగా ఆలోచించి మామూలు చదువులతో పాటు సమాజంలోని వివిధ అంశాల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లారు. అక్టోబరు 14న అబ్దుల్ కలాం పుట్టిన రోజైన నేషనల్ స్టూడెంట్ ఆఫ్ సైన్స్ సందర్భంగా పాఠశాలలోని 37మంది విద్యార్థులను హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి భవన్ సందర్శనకు తీసుకెళ్లారు. అలాగే హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఎర్రగుంట పాఠశాల విద్యార్థులు రెండు ప్రాజెక్టులను ప్రదర్శించారు. అందులో 'వృక్షాలనుంచి సురక్షితంగా ఫలాల సేకరణ' అనే ప్రాజెక్టు ప్రదర్శనకు రాష్ట్ర స్థాయిలో ఐదో బహుమతిని అందుకున్నారు. 2024లో 45 మంది విద్యార్థులను శ్రీహరికోటలోని ఇస్రో తీసుకెళ్లి చూపించారు. నీలాద్రి కొండలపైన ఉన్న పురాతన మానవుడి వేసిన రాతి చిత్రాలను చూపించారు. వీటితో పాటు వరి పొలాలు నాటడం, కోతలు, బియ్యం మిల్లులు సందర్శన, వ్యవసాయ, ఉద్యాన పరిశోధన కేంద్రాలు సందర్శింపచేసి వాటిపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదిగిననాడే జీవితం ధన్యం

● ఉండేటి ఆనంద్‌కుమార్

ఉపాధ్యాయవృత్తి ఎంతో ఉన్నతమైంది. ప్రభుత్వం ఇచ్చే జీతం కన్నా విద్యార్థుల భవిష్యత్ ముఖ్యం వారిని ఉన్నతంగా తీర్చిదిద్దితేనే నిజమైన తృప్తి. ఆనందం. అందుకే వారికి ఒక్క చదువే కాకుండా విజ్ఞానం, సమాజం పట్ల, వ్యవసాయం, వివిధ అంశాలపై అవగాహన కల్పించడం, వాటిని చూ పించడం, చేయించడం ద్వారా సమాజానికి ఉపయోగపడేలా చేయొచ్చన్న ఉద్దేశ్యంతో మా ఉపాధ్యాయుల సహకారంతో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ చర్యలను విద్యాశాఖ గుర్తించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం మిగిలిన వారికి కూడా స్ఫూర్తినిస్తుందని అనుకుంటున్నా.



కమనీయం ఉర్సోత్సవం



ఇల్లెందులో ఉర్సే షరీఫ్ వేడుకలకు తరలొచ్చిన జనం



నాగుల్‌మీరాకు ప్రత్యేక వస్త్రాలు సమర్పించిన దర్గా ప్రముఖులు





వేడుకల్లో ఎమ్మెల్యే కోరం, మాజీ స్పీకర్ మధుసూదనా చారి

- ఇల్లెందులో వెల్లివిరిసిన మత సామరస్యం
- కన్నుల పండువగా జులూస్
- ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఇల్లెందు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గుబాళించిన మతసామరస్యం.. వెల్లివిరిసిన ఆధ్యాత్మిక చింతన.. భక్తి పారవశ్యంతో పులకరించిన ప్రజానీకం.. ఉర్సే షరీఫ్ వేడుకల్లో భిన్నత్వంలో ఏకత్వం చాటుతూ పరవశించింది. కులమతాలకు అతీతంగా మత సామరస్యానికి ప్రతీకగా ఉర్సే షరీఫ్ వేడుకలు గురువారం ఇల్లెందు పట్టణంలో వైభవంగా జరిగాయి. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ఆధ్యాత్మిక చింతనతో వివిధ జిల్లాల నుంచి తరలొచ్చిన వేలాది మంది భక్తజనం నిర్వహించిన జులూస్‌లో పాల్గొని తన్మయత్వం చెందారు. బుధవారం రాత్రి జరిగిన సందల్ చాదర్ వేడుకల్లో సైతం వివిధ జిల్లాల నుంచి తరలొచ్చిన ప్రజలు సత్యనారాయణపురం సమీపంలోని అటవీ ప్రాంతంలోని హజరత్ నాగుల్ మీరా మౌలా చాన్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 23 ఏళ్లుగా జరుగుతున్న హజరత్ నాగుల్ మీరా ఉర్సే షరీఫ్ వేడుకల్లో మతసామరస్యం వెల్లివిరిసింది. పట్టణంలోని నెం2 బస్తీలో గల హజరత్ ఖాసీం దుల్హా దర్గాలో గురువారం ఉదయం పూజల అనంతరం పట్టణంలో భారీ జులూస్ సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన గుర్రపు బగ్గీలు, వాహనాల్లో హజరత్ నిషానీలను ఉంచి ఊరేగింపు నిర్వహించారు. సాంప్రదాయ బద్ధంగా భక్తి పారవశ్యంతో భక్త జనం నాగుల్ మీరాకు పూజలు చేశారు. పట్టణంలో సాగిన జులూస్‌లో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. దర్గాలో దర్గా మాలిక్ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో జరిగిన నాగుల్‌మీరా పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, డీఎస్పీ చంద్రభాను, ఇల్లెందు మేజిస్ట్రేట్ కీర్తచంద్రిక రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఐదు గంటల పాటు సాగిన జులూస్ వల్ల పలుచోట్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి.

● ఆకట్టుకున్న జులూస్

కార్తీక మాసంలో ప్రతి ఏటా వైభవంగా జరిగే ఉర్సే షరీఫ్ వేడుకల సందర్భంగా ఇల్లెందు పట్టణంలోని హజరత్ నాగుల్‌మీర దర్గా నుంచి సత్యనారాయణపురం అటవీ ప్రాంతంలోని చిల్లా వరకు సాగిన జులూస్ ఆద్యంతం భక్తి శ్రద్ధలతో సాగింది. ఈ ఊరేగింపులో గుర్రపు బగ్గీలపై, వాహనాలపై ప్రత్యేకంగా అలంకరించిన వేదికలపై హజరత్ నిషానీలను ఒంటెలు, గుర్రాలపై హజరత్ పతకాలను ప్రదర్శిస్తూ ఊరేగింపు నిర్వహించారు. కేరళ నుంచి వచ్చిన తంభోళం, క్లాష్ వాయిద్య కళాకారులు, ఆదివాసీ కొమ్ముడోలు నృత్యాలు, నాగపూర్‌కు చెందిన కవ్వాలి కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గుర్రాలు సైతం పట్టణ పురవీధుల్లో నృత్య విన్యాసాలు చేయడంతో ప్రజలు కేరింతలు కొట్టారు. ఊరేగింపులో అయ్యప్ప మాలధారులు సైతం పాల్గొనడం విశేషం. తరలొచ్చిన భక్తజనం యావత్తూ తెల్లని వస్త్రాలు ధరించి జులూస్‌లో పాల్గొనడం గమనార్హం. మహిళలు కోలాటాలు వేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. నిషానీలను దర్శించుకునేందుకు పట్టణ ప్రజలు పెద్దఎత్తున ప్రధాన వీధులకు చేరుకోవడంతో.. ప్రధాన వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి. సత్యనారాయణపురం అటవీ ప్రాంతంలోని హజరత్ నాగుల్ మీరా దర్గాకు భక్త జనం భారీగా తరలొచ్చి నాగుల్ మీరాకు పూజలు నిర్వహించారు.

నమూనా పరీక్షను సద్వినియోగం చేసుకోండి

ఐఏఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ఖమ్మం లీగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద విద్యనభ్యసించిన అనంతరం న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించాలంటే ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులు అవ్వాల్సి ఉంటుందని.. అత్యంత కఠినంగా ఉండే ఈ పరీక్షలో విజయం సాధించడానికి దోహదపడేలా ఏఐబీఈ నమూనా పరీక్షను ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన ఖమ్మం నగరంలోని మానేరు కాలేజ్ ఆఫ్ లా లో నిర్వహించనున్నట్లు ఐఏఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ లతీఫ్, శేషగిరిరావు తెలిపారు. గురువారం ఐఏఎల్ పట్టణ కార్యదర్శి ముమ్మిడి సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 22వ తేదీన జరిగే ఏఐబీఈ నమూనా పరీక్షకు సర్వం సిద్ధం చేశామన్నారు. 256 మంది అభ్యర్థులు ప్రస్తుతానికి నమోదు చేసుకున్నారన్నారు. ఎవరైనా నమోదు చేసుకోలేని వారుంటే 22వ తేదీన ఉదయం 9గంటల వరకు మానేరు కాలేజ్ ఆఫ్ లా వద్దకు చేసుకొని నమోదు చేసుకోవచ్చన్నారు. ఏఐబీఈ పరీక్షా నిబంధనలే ఈ నమూనా పరీక్షకు కూడా వర్తిస్తాయని తెలిపారు. అభ్యర్థులకు బార్ కోడ్‌తో కూడిన హాల్ టికెట్, ప్రశ్నాపత్రాన్ని ఇవ్వడం జరుగుతుందన్నారు. 22వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు పరీక్ష ఫలితాలను వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ నమూనా పరీక్షకు సీనియర్ న్యాయవాది సోమశేఖరశర్మ చీఫ్ ఎగ్జామినర్‌గా వ్యవహరించనున్నారు. గత 2024 సంవత్సరంలో తమ ఆధ్వర్యంలో నిర్వహించిన నమూనా ఏఐబీఈ పరీక్షలో 90శాతం మంది పాస్ అయ్యారని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. ఖమ్మం పరిసర ప్రాంతంలో ఇటీవల కాలంలో న్యాయవిద్యలో పట్టాపొందిన న్యాయవాదులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్వీ రమణ, కోశాధికారి కొలికొండ శరత్‌బాబు, జిల్లా సమితీ సభ్యులు రేగళ్ల రాకేష్, ఎం.డి.పర్వేజ్, తెల్లూరి మధు, మామిడి లక్ష్మిప్రియ, కటామ్ బీరేందర్, సుజాతసింగ్, ఆర్.రమాదేవి, న్యాయవాదులు ఐఏఎల్ సభ్యులు అక్షయ్, కపిల లిఖిత, బలుసు కీర్తిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ లతీఫ్, శేషగిరిరావు

జనగణనకు రాష్ట్ర సర్కారు కసరత్తు

- తెలంగాణలో ప్రీ టెస్ట్‌కు మూడు మండలాల ఎంపిక
- పినపాక మండలంలో ఈ నెల 30 కల్లా పూర్తి



తోగ్గూడెంలో జనగణన తీరును పరిశీలిస్తున్న భారతి హోలీకేరీ

పినపాక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ జనగణన 2027 లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ జనగణనకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని జనగణన ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోలీకేరీ తెలిపారు. గురువారం పినపాకలో పర్యటించిన ఆమె.. జనగణన ప్రీ టెస్ట్ సర్వేను పరిశీలించారు. తోగ్గూడెం గ్రామంలో జరుగుతున్న జనగణన బృందంతో కలిసి ఆమె ప్రీ టెస్ట్ సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతి హోలీకేరీ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రీ టెస్ట్‌కు మూడు మండలాలు ఎంపిక చేయగా, జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఓ మండలాన్ని, నల్గొండ జిల్లాలోని ఓ మండలంతో పాటు, గిరిజన మండలంగా ఉన్న భద్రాద్రి జిల్లాలోని పినపాకను కూడా ఎంపిక చేయడం జరిగిందన్నారు. పూర్తిగా 100 శాతం డిజిటల్ ప్రక్రియలో జరిగే ఈ జనగణనకు నిపుణులు అభివృద్ధి చేసిన సాంకేతిక సామగ్రిని వినియోగిస్తున్నట్టు తెలిపారు. సర్వేలో సేకరించిన సమాచారాన్ని ప్రత్యేక పోర్టల్ యాప్‌లో పొందుపరచనున్నట్టు చెప్పారు. ఈ ప్రక్రియలో ముందుగా హెచ్‌ఎల్‌ఏ యాప్‌లో ఇంటిగణన చేసి, వారికి నంబర్లు కేటాయించి, జియోట్యాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇంటిగణన ముగిశాక జనగణన ప్రారంభించి ఈ నెల 30 కల్లా ప్రీ టెస్ట్ సర్వేను పూర్తి చేస్తామన్నారు. ఇందుకోసం సూపర్‌వైజర్లకు, ఎన్యుమరేటర్లకు, చార్జ్ ఆఫీసర్లకు ప్రత్యేకంగా మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఇంటిగణన, జనగణన నమోదులో తలెత్తే సాంకేతిక సమస్యలు, లోపాలు, ఇతర అంశాలను గమనించి సరిదిద్దనున్నట్లు తెలిపారు. పూర్తిగా డెవలప్ చేసిన యాప్‌తో 2026 లో పూర్తి స్థాయిలో జనగణన ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెన్సస్ ఆపరేషన్ జాయింట్ డైరెక్టర్ శేఖర్, డిప్యూటీ డైరెక్టర్ సుబ్బరాజు, పినపాక తహశీల్దార్ గోపాలకృష్ణ, ఎన్యుమరేటర్స్ సతీష్, హిమవర్ష, హరిత, తిరుపతి, వినయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌కు.. సహకారం

(5వ పేజీ తరువాయి)

16వేల ఎకరాలలో తోటలు వేయడం జరిగింది. ఈ లక్ష్య సాధనలో భాగంగా ఖమ్మం జిల్లాలోని 71 సహకార సంఘాలకు ఒక్కో సంఘానికి 130 ఎకరాల చొప్పున 9800 ఎకరాలు, అలాగే భద్రాద్రిలోని 21 సహకార సంఘాల ద్వారా 2730 ఎకరాల్లో పామాయిల్ తోటలను విస్తరింపజేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. సహకార సంఘాల పరిధిలోని రైతులను ఆయా సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసి పామాయిల్ తోటలపై అవగాహన కల్పించడం, ఉద్యానశాఖ కల్పిస్తున్న రాయితీలు, ఎరువులు, మొక్కలకు ఇచ్చే రాయితీలు, రుణ సదుపాయం, దిగుబడులు వంటి వాటిపై అవగాహన కల్పించి గుర్తించిన రైతులను ఉద్యాన శాఖ అధికారులకు చేరవేసి వారి ద్వారా పామాయిల్ తోటలు వేయించే బాధ్యతను ఆయా సంఘాలకు అప్పగించారు. ఇప్పటికే భద్రాద్రి జిల్లాలో సహకార సంఘాల ద్వారా 452 ఎకరాల్లో తోటలు వేసే రైతులను గుర్తించారు. మార్చినాటి కల్లా లక్ష్యాన్ని సాధించే దిశగా సహకార సంఘాలు ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 1,17,000 ఎకరాల్లో విస్తరించి ఉన్న పామాయిల్ తోటలు లక్ష్యాన్ని సాధించినట్లయితే వచ్చే మార్చి నాటికి జిల్లాలో మొత్తం 1,46,000 ఎకరాలకు సాగు చేరనుంది.

12,610 ఎకరాల్లో విస్తరణ లక్ష్యం : డీసీవో శ్రీనివాస్

ఉమ్మడి జిల్లాలోని 97 సహకార సంఘాల ద్వారా ఒక్కో సంఘం 130 ఎకరాల చొప్పున మొత్తం 12,610 ఎకరాల్లో వచ్చే మార్చినాటికల్లా పామాయిల్ తోటలు విస్తరింపచేయాలని లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగింది. ఇప్పటికే జూలూరుపాడు, టేకులపల్లి, నారాయణపురం సొసైటీల పరిధిలో 452 ఎకరాలను గుర్తించి ఉద్యాన శాఖ అధికారులకు ఆ జాబితాను అప్పగించాం. సహకార సంఘాల పరిధిలో రైతులను చైతన్యపరిచేందుకు ప్రణాళికలు రూపొందించాం.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్

పోటీలకు బోనకల్ క్రీడాకారులు

అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శశికళ



శశికళ

బోనకల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల చివరి వారంలో తమిళనాడులో జరగనున్న జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బోనకల్‌కు చెందిన క్రీడాకారులు బి. గోపి, మధులత, జశ్వితలు ఎంపికయ్యారు. ఈ నెల 25 నుంచి రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో జరగనున్న శిక్షణ అనంతరం వీరు జాతీయ స్థాయి పోటీలలో ఆడనున్నారు. గోపికి ఇప్పటికే రెండు సార్లు అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న అనుభవం ఉంది. ఇదే నెల చివర వారంలో పాట్నాలో జరగను న్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు చాపలమడుగు శశికళ ఎంపికైంది. ఇప్పటివరకు పలుసార్లు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని అత్యుత్తమ క్రీడా ప్రతిభను చాటిన క్రీడాకారిణిగా శశికళకు మంచి పేరుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు వరుసగా బోనకల్ క్రీడాకారులు ఎంపిక కావడం పట్ల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, అధ్యక్షులు వేజళ్ల సురేష్, కోచ్ అమరేసి లింగయ్యలు అభినందనలు తెలిపారు.

పరిమితికి మించి ఆటోలో ఎక్కిస్తే చర్యలు : సీఐ

ఖమ్మం క్రైం, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి) : స్కూల్ ఆటో పేరుతో పాఠశాల విద్యార్థులను పరిమితికి మించి ఆటోలో ఎక్కిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం నగరంలోని ట్రాఫిక్ పోలీసులు పలుప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించడమేనన్నారు. అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

నేడు అందెశ్రీ సంస్మరణ సభ

ఖమ్మంఅర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రగీత రచయిత దివంగత అందెశ్రీ సంస్మరణ సభ శుక్రవారం సాయంత్రం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరగనుంది. అందెశ్రీ మిత్రుల పేరిట జరిగే ఈసభలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఖాసీం, అరుణోదయ అధ్యక్షురాలు విమలక్క, ప్రజా కవులు జయరాజు, ఏపూరి సోమన్న, పరకాల నాగన్న తదితరులు పాల్గొంటారు.

క్రీడా సమాచారం



విజేతలను అభినందిస్తున్న హెచ్‌ఎం రాంచంద్రయ్య

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఎంపిక

అభినందించిన హెచ్‌ఎం రాంచంద్రయ్య

కరకగూడెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిరుమళ్ళ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఐటీడీఏ భద్రాచలం జోనల్ స్థాయి గిరిజన క్రీడా పోటీలలో బుధవారం కిన్నెరసానిలో జరగ్గా.. ఇందులో అండర్ -14 లాంగ్ జంప్‌లో 3వ స్థానంలో, 100మీటర్స్ రన్నింగ్‌లో రెండోవ స్థానంలో తాటి అదమయ్య, అలాగే 200మీటర్స్ రన్నింగ్‌లో ఎం. నందు విజేతలుగా నిలిచారు. ఖోఖోలో అండర్-14లో జి. శరత్, పి. సిద్ధు, కబడ్డీలో అండర్- 14లో బి భరత్, పి సుశాంత్, వాలీబాల్ అండర్- 14లో జి. శరత్‌బాబు విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం రాంచంద్రయ్య తెలిపారు. విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

23న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే సీనియర్ పురుషుల, మహిళల జిల్లా బాస్కెట్‌బాల్ జట్లను ఈ నెల 23న నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ ఇండోర్ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయసారధి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి ఈనెల 28 నుంచి 30 వరకు సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని ఆయన తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్‌తో ఉదయం 8 గంటలకల్లా ఇండోర్‌కు చేరుకోవాలని కోరారు.



గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం

28,30 తేదీల్లో కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ కబడ్డీ పోటీలు

కొత్తగూడెం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ కబడ్డీ పోటీలు కొత్తగూడెం ఏరియాలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు తెలిపారు. కోల్‌ఇండియా స్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జయశంకర్ గ్రౌండ్‌ను పరిశీలించారు. ఏర్పాట్ల వివరాలను వసతి సదుపాయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియాలో ప్రతిష్టాత్మకంగా పోటీలను నిర్వహిస్తున్నామని ఏర్పాట్లను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు మోహన్‌రావు, కిష్టోఫర్, రాజారామారావు, యనియన్ నాయకులు గట్టయ్య, రజాక్, క్రీడా కో ఆర్డినేటర్ భీముడు, స్పోర్ట్స్ ఆర్గనైజర్‌లు సాగర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మధిర మైనార్టీ విద్యార్థులు

మధిర రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 69వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా అండర్-17 విభాగంలో కల్లూరులో జరిగిన ఖోఖో పోటీల్లో మధిర మైనార్టీ గురుకుల విద్యార్థులు తమ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు షేక్.జావెద్, బి.నర్సింహులు ఎంపికైన వారిలో ఉన్నారు. అలాగే హరికిరణ్ అనే విద్యార్థి స్టాండ్ బైగా ఎంపికయ్యాడు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ షేక్.షమీన్‌తో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ రెస్క్యూ పోటీలకు జడ్జిగా రాజేశ్వర్



ఇల్లెందు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాపిత బొగ్గు గనుల రెస్క్యూ పోటీలు - 2025కు న్యాయ నిర్ణేతగా సింగరేణి కాలరీస్‌కు చెందిన డాక్టర్ ఏ.రాజేశ్వర్ నియమితులయ్యారు. డిశంబరు 1 నుంచి 7వ తేదీ వరకు నాగపూర్ పట్టణంలో 54వ జాతీయస్థాయి రెస్క్యూ పోటీలు జరగనున్నాయి. మ్యాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్(ఎంవోఐఎల్) ఆధ్వర్యంలో ఈ పర్యాయం జాతీయ రెస్క్యూ పోటీలు నిర్వహిస్తున్నారు. దేశ వ్యాపితంగా మైనింగ్ మెటల్ తదితర సంస్థల నుంచి రెస్క్యూ పోటీలకు పురుషులు-మహిళల విభాగాల నుంచి 35 జట్లు పాల్గొంటున్నాయి. డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ సేఫ్టీ ద్వారా నిర్వహిస్తున్న రెస్క్యూ పోటీలకు వివిధ విభాగాలకు సంబంధించి 30 మందిని న్యాయ నిర్ణేతలుగా నియమించారు. రెస్క్యూ పోటీల్లో ఫస్ట్ ఎయిడ్, రోప్ రెస్క్యూ, రెస్క్యూ అండ్ రికవరీ స్టాచుటరీ రెస్క్యూ థియరీ, రెస్క్యూ రికవరీ తదితర విభాగాల్లో పోటీలు జరుగుతాయి. కాగా సింగరేణి కాలరీస్‌లో గత 25 సంవత్సరాలుగా ఫస్ట్ ఎయిడ్‌పై రెస్క్యూ బృందాలకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ రాజేశ్వర్ గత 5సంవత్సరాలుగా వరుసగా ఫస్ట్ ఎయిడ్ విభాగం పోటీలకు జడ్జిగా వ్యవహరిస్తుండటం గమనార్హం. హైదరాబాద్‌లోని సింగరేణి కాలరీస్ కేంద్ర కార్యాలయంలో సీనియర్ మెడికల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 54 జాతీయ రెస్క్యూ పోటీలకు సింగరేణి కాలరీస్ నుంచి ప్రపథమంగా ఈ పర్యాయం మహిళల జట్టుకూడా పాల్గొంటుండటం విశేషం. సింగరేణి కాలరీస్ నుంచి జాతీయ రెస్క్యూ పోటీలకు రెండు పురుషుల జట్టు, ఒక మహిళా జట్టు పాల్గొంటున్నాయి. సింగరేణి కాలరీస్ రెస్క్యూ బృందం జాతీయ స్థాయిలో వరుసగా హాట్రిక్ అవార్డులు ఫస్ట్ ఎయిడ్ విభాగంలో సాధించడం విశేషం. ఎంపిక చేసిన పురుషుల మహిళా జట్ల సభ్యులకు గత కొద్ది రోజులుగా రామగుండం 2వ డివిజన్ రెస్క్యూ స్టేషన్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సింగరేణి కాలరీస్ యాజమాన్యం సింగరేణి జట్లకు ప్రత్యేకించి నేషనల్ డిజాస్టర్ రెస్క్యూ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్) నుంచి ట్రైనర్లను రప్పించి శిక్షణ ఇప్పిస్తుండటం గమనార్హం.

జోరుగా తెల్ల బంగారం కొనుగోళ్లు..

- ఇతర రాష్ట్రాలకు ఎగుమతి..
- 3వేల క్వింటాల కొనుగోలు
- జూలూరుపాడుకు వచ్చిన గుజరాత్, మహారాష్ట్రాల వ్యాపారులు

జూలూరుపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జూలూరుపాడులో తెల్ల బంగారం కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. రైతులు పత్తి తీత పనులను ముమ్మరం చేశారు. చేతి కందిన కొద్దిపాటి పంటను రైతులు విక్రయిస్తుండడంతో పత్తి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో గత నాలుగు రోజులుగా జూలూరుపాడులో ప్రైవేట్ వ్యాపారులు అధిక మొత్తంలో పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి వ్యాపారుల వద్ద నుంచి ఇతర రాష్ట్రాలకు చెందిన బయ్యర్లు పత్తిని కొనుగోలు చేసి తమ ప్రాంతానికి తరలిస్తున్నారు. శాశ్వత మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడంతో ఈ ఏడాది జూలూరుపాడులో మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు జరపడం లేదు. దీంతో లైసెన్సులు కలిగిన ప్రైవేట్ వ్యాపారులు కొందరు జూలూరుపాడులోని క్రీడా ప్రాంగణంలో కొంటర్లను ఏర్పాటు చేసి పత్తి క్రయవిక్రయలు జరుపుతున్నారు. చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు తదితర మండలాల్లోని రైతులు పత్తిని వాహనాల్లో జూలూరుపాడుకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. మూడు రోజుల క్రితం వ్యాపారులు సుమారు 3,500 క్వింటాలకు పైగా పత్తిని కొనుగోలు చేశారు. ప్రభుత్వం పత్తికి రూ. 8,110లు మద్దతు ధర ప్రకటించింది. కాగా వ్యాపారులు మాత్రం రైతుల వద్ద నుంచి క్వింటా పత్తిని రూ. 5 వేల నుంచి 6 వేలకు కొనుగోలు చేయడంతో వారు నిరాశ చెందారు. దీంతో తమకు కనీసం ప్రభుత్వ మద్దతు ధర కూడా దక్కడం లేదని రైతులు వాపోతున్నారు.

జూలూరుపాడు నుంచి పత్తిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. గుజరాత్, మహారాష్ట్రలకు చెందిన బయ్యార్లు జూలూరుపాడుకు వచ్చారు. వారు ఇక్కడే ఉండి ప్రైవేట్ వ్యాపారుల వద్ద నుంచి పత్తిని కొనుగోలు చేసి లారీలలో తమ రాష్ట్రలలోని మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో జూలూరుపాడు నుంచి ప్రతి రోజు 2 వేల నుంచి 2500 క్వింటాలు (15 లారీల)పత్తిని గుజరాత్, మహారాష్ట్రకు తరలిస్తున్నారు.



ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు జూలూరుపాడులో లారీలలో పత్తిని లోడ్ చేస్తున్న దృశ్యం

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి



వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా తయారీపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్, జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హైదరాబాద్ నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొనగా, కలెక్టరేట్ నుంచి పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరలో నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించిందని, సజావుగా ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనుకుంటే, ప్రతి ఫేజ్‌లో ఏ మండలాలు ఎన్నికలు జరగాలో జిల్లా వారీగా ప్రణాళికలు అందించాలన్నారు. పంచాయతీ తుది ఓటరు జాబితాకు సంబంధించి ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించి, ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఫొటోలతో కూడిన ఓటరు జాబితా ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఎంసీసీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎంసీసీ ఉల్లంఘనపై వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారానికి యంత్రాంగం సిద్ధం చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, వార్డులకు సంబంధించి రిజర్వేషన్ ప్రక్రియ ఖరారు చేసి చెక్ చేసుకోవాలని, ప్రతి వర్గంలో మహిళలకు రిజర్వేషన్ 50 శాతం అమలు కావాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా పంచాయతి అధికారి ఆశాలత, జడ్పీ డిప్యూటీ సీఈవో నాగపద్మజ, డివిజనల్ పంచాయతీ అధికారులు విజయలక్ష్మి, రాంబాబు పాల్గొన్నారు.

గ్యారెంటీ ఇవ్వకుంటే ధాన్యం ఇచ్చేది లేదు

- నిబంధనలు పాటించే రైస్ మిల్లులకే కేటాయింపు
- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన మిల్లులకే ధాన్యం కేటాయింపు చేయనున్నట్లు.. నిబంధనలు పాటించే రైస్ మిల్లులకే ధాన్యం కేటాయించనున్నట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ధాన్యం కొనుగోళ్లపై రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. జిల్లాలో 71 రైస్ మిల్లుల్లో ఇప్పటి వరకు 63 రైస్ మిల్లర్లు మాత్రమే బ్యాంకు గ్యారంటీలు సమర్పించారని, మిగిలిన 8 మిల్లులకు ఎట్టి పరిస్థితులలో ధాన్యం కేటాయింపులు జరగవని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. 8 మిల్లులు గతంలో పెండింగ్ ఉన్న రైస్ డెలివరీ పూర్తి చేసి, బ్యాంక్ గ్యారంటీలు సమర్పిస్తే ఖరీఫ్ సీజన్ ధాన్యం కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. 10 శాతం బ్యాంకు గ్యారంటీ, పెండింగ్ యాసంగి రైస్ డెలివరీ పూర్తి చేయని పక్షంలో రైస్ మిల్లులకు గోడౌన్ ట్యాగ్ చేయనున్నట్లు తెలిపారు. .

ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ధాన్యం తీసుకున్న ప్రతి రైస్ మిల్లర్ తప్పనిసరిగా యాసంగి కేటాయింపు తీసుకోవాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి సీజన్‌లో 2 నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లర్లకు కేటాయించాల్సి ఉంటుందని, దీనికి అనుగుణంగా మిల్లర్లు కొల్లేటరల్ బ్యాంకు గ్యారంటీ సిద్ధం చేసుకోవాలన్నారు. రైస్ డెలివరీకి సంబంధించి గోదాముల సమస్య పరిష్కారం కోసం నూతన గోదాముల నిర్మాణం చేపట్టామన్నారు.

రైస్ మిల్లులకు ఉన్న వివిధ సమస్యల సంబంధించి దరఖాస్తులు అందిస్తే ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి సీజన్ 1,70,000 మెట్రిక్ టన్నులకు పైగా బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుందని, ఇక్కడ గోదాముల స్థలం సరిపోయేంత లేదన్నారు. గోడౌన్ సమస్య వల్ల దూర ప్రాంతాలకు బియ్యం డెలీవరి సమయంలో రవాణా ఖర్చులు అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, సంబంధిత అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

భద్రాద్రిలో పరిశ్రమలకు పూర్వ వైభవం తేవాలి

- కేంద్రమంత్రి జయంత్‌ను కలిసిన టీఆర్ఎల్‌డీ జిల్లా అధ్యక్షుడు సతీష్



కేంద్ర మంత్రి జయంతి చౌదరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కట్టా సతీష్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పరిశ్రమలకు పూర్వవైభవం తేవాలని, మూసిన పరిశ్రమలు తెరిపించి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని తెలంగాణ రాష్ట్రీయ లోకదళ్ పార్టీ (ఆర్ఎల్‌డీ) జిల్లా అధ్యక్షుడు కట్టా సతీష్ కోరారు. ఆర్ఎల్‌డీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ స్వగృహానికి గురువారం హైదరాబాద్ విచ్చేసిన కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రి, రాష్ట్రీయ లోకదళ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు జయంతి చౌదరిని మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాన్ని అందించారు. భద్రాద్రి జిల్లాలో ఉన్న పరిస్థితులను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పరిశ్రమల ఖారిడార్‌గా పేరు ప్రఖ్యాతలు గాంచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేడు పరిశ్రమలు అంతరించిపోయే ప్రమాదంలో ఉందని తెలియజేశారు. స్పందించిన కేంద్ర మంత్రి తప్పక సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

పాఠశాల నిర్మాణ పనుల అడ్డగింత

దుమ్ముగూడెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినబండిరేవు వద్ద ఇరవై ఎకరాల్లో టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ నిధులు రూ.200 కోట్లతో నిర్మించ తలపెట్టిన పాఠశాల భవనాల నిర్మాణ పనులను కొందరు స్థానికులు గురువారం అడ్డుకున్నారు. ఎక్స్‌కవేటర్‌తో భూమి చదును పనులు ప్రారంభించగా, ఆపాలంటూ యంత్రానికి అడ్డుపడడంతో పనులను నిలిపివేశారు. వివాదస్పద ప్రాంతాన్ని పాఠశాల నిర్మాణం కోసం తహసీల్దార్ ప్రభుత్వ భూమిగా గుర్తించి అందజేశారు. కాగా 75ఏళ్లుగా ఈ భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నామంటూ 28 కుటుంబాల వాళ్లు నిర్మాణ స్థలానికి ఎదురుగా టెంట్ వేసుకొని నిరసనకు దిగారు. తమకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని అనుభవదారులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది ఆందోళన చేస్తున్న వారిని ఆధారాలతో సహా స్టేషన్‌కు రావాలని తెలిపారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

లక్ష్మీదేవిపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో పనిచేసేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న సుతారి మేస్త్రీ లక్ష్మీనారాయణను కొత్తగూడెం వైపునకు వస్తున్న ఓ కారు బలంగా ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

హోటల్ యజమాని దివాలా?

భద్రాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉండే ఓ హోటల్ యజమాని ఆర్థిక ఇబ్బందులతో దివాలా తీసినట్లుగా ప్రచారం సాగుతోంది. గత కొన్నేళ్లుగా హోటల్ వ్యాపారం నిర్వహిస్తూ సదరు హోటల్ యజమాని ఇటీవల ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుండటంతో కొన్ని రోజులుగా హోటల్‌ను పూర్తిగా మూసివేసినట్లు అతనికి అప్పులిచ్చిన వారు పేర్కొంటున్నట్లు సమాచారం. అలాగే సెల్‌ఫోను సైతం స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో అప్పిచ్చిన వారిలో ఆందోళన నెలకొన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయమై అధికారికంగా ఎటువంటి స్పష్టత లేనప్పటికీ సామాజిక మాధ్యమాల్లో కోట్లాది రూపాయలు అప్పులున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.

ఇద్దరు ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల అదృశ్యం

దుమ్ముగూడెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు వారి ఇళ్ల నుంచి అదృశ్యమైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎనిమిది, తొమ్మిది తరగతులు చదువుతున్న విద్యార్థినులు ఒకరిది మంగువాయిబాడవ, మరొకరిది కాటాయిగూడెంగా తెలుస్తోంది. విద్యార్థినులు సుమారు వారం క్రితం బ్యాంకు ఖాతా తెరవడానికి వారి బంధువులతో కలిసి లక్ష్మీనగరం వచ్చారు. ఇంటికి తిరిగి వెళ్లిన తర్వాత నుంచి వారిరువురూ కనబడకుండా పోయారు. విద్యార్థినుల కుటుంబీకులు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

65 కేజీల కల్తీ నెయ్యి పట్టివేత



పట్టుబడిన కల్తీ నెయ్యి

భద్రాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) భద్రాచలంలోని విజయ భాస్కర్ థియేటర్ సమీపంలో ఉన్న ఓ లాడ్జిలో 65 కేజీల కల్తీ నెయ్యిని గురువారం భద్రాచలం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఆ లాడ్జిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఓ గదిలో ఉన్న కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నలుగురు వ్యక్తులు మల్లిఖార్జున్, శ్రీనివాస్, షిరేశ్వర, కె.మల్లిఖార్జున ల వద్ద ఈ కల్తీ నెయ్యి పట్టుబడింది. కల్తీ నెయ్యి విలువ రూ.52వేల రూపాయలు ఉంటుందని ఎస్ఐ వి.సతీష్ తెలిపారు. దీంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఈ విషయమై సమాచారం ఇచ్చి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హతమార్చిన భర్త

- అడ్డొచ్చిన కుమార్తెకు గాయాలు
- ఖమ్మం నగరంలో ఘటన
- దంపతుల మధ్య మనస్పర్థలే కారణం

ఖమ్మం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరి మధ్య ఏర్పడిన మనస్పర్థల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్యపై కత్తితో దాడి చేసి హతమార్చిన సంఘటన గురువారం తెల్లవారుజామున ఖమ్మంనగరలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన గోగుల భాస్కర్ వ్యవసాయం చేస్తుంటాడు. పదహారేళ్ల క్రితం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన సాయి వాణి (33)తో అతడికి వివాహమైంది. వీరికి తొమ్మిదో తరగతి చదివే కుమార్తె హర్షవర్ధని, ఆరో తరగతి చదివే కుమారుడు వేమేంద్ర లక్ష్మీనర్సింహ ఉన్నారు. పెళ్లయిన కొంత కాలం తర్వాత తరచూ భార్యను వేధించాడు. దాంతో పలు మార్లు బంధువులు, పెద్దల సమక్షంలో పంచాయితీలు చేయగా.. తర్వాత ఇద్దరూ కలిసి ఉన్నారు. కానీ మళ్లీగొడవలు జరగడంతో సాయివాణి తన భర్తపై జగ్గయ్యపేట పోలీసుస్టేషన్‌లో కూడా పలుమార్లు ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి పంపినా భర్త ప్రవర్తనలో మార్పురాలేదు. దీంతో విసుగు చెందిన సాయివాణి ఏడాది కాలంగా ఖమ్మం నగరంలోని గట్టయ్యసెంటర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఓ ఫంక్షన్‌హాల్‌లో పని చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటూ నివసిస్తోంది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున భాస్కర్ ఆమె అద్దెకుంటున్న ఇంటికి వచ్చి తలుపులు కొట్టాడు. దాంతో సాయివాణి తలుపులు తీసి బయటకురాగా భాస్కర్ ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడిచేశాడు. ఆమె కేకలు వేయడంతో ఇంట్లోనే ఉన్న కుమార్తె వచ్చిన తన తండ్రిని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఆమె చేతులకు కూడా గాయాలయ్యాయి. ఈ సమయంలో తప్పించుకునేందుకు సాయివాణి పరిగెత్తుతుండగా భాస్కర్ వెంటపడి మరీ కత్తితో ఆమె ముఖం, గొంతు, కాళ్ల తదితర భాగాల్లో కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో సాయివాణి అక్కడికక్కడే మృతిచెందింది .



సాయివాణి (ఫైల్‌ఫొటో)

వారి కుమారుడు తమ పెద్దమ్మ గొడవర్తి కుసుమకు ఫోన్‌చేసి విషయం చెప్పగా.. ఘటనను చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఖమ్మం టూ టౌన్ పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్నిప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. అదేవిధంగా గాయపడిన హర్షవర్ధినిని ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతురాలి అక్క కుసుమ, ఆమె భర్త అక్కడే ఉన్న భాస్కర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈఘటనపై మృతురాలి అక్క కుసుమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో జట్ల ఎంపికలు



ఎంపికైన బాలికల ఖోఖో జట్టు

కల్లూరు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని మినీ స్టేడియం క్రీడా ప్రాంగణంలో గురువారం ఎస్‌జీఎఫ్ ఖమ్మం ఉమ్మడి జిల్లా స్థాయిలో అండర్-17 బాల, బాలికల ఖోఖో జట్ల ఎంపికలు జరిగాయి. ఈ జట్ల ఎంపికలకు గాను భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా తరలివచ్చారు. త్వరలో యాద్రాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఆయా జట్ల నుంచి ఖోఖో క్రీడాకారులు పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ క్రీడల సమైఖ్య కార్యదర్శి వై. రామారావు, ఎంఈవో పి. నివేదిత, ఆర్గనైజింగ్ సెక్రటరీలు బోడ భీమా, పి. వీరరాఘవయ్యలు తెలిపారు. క్రీడాకారులకు గాను పీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు తరఫున ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పించారు. ఈ క్రీడల ఎంపికల్లో సభ్యులైన పి. నరస్సయ్య, నక్క వెంకటేశ్వర్లు, ఎం. కృష్ణపవన్‌కుమార్, వి. కృష్ణారావు, వి. రాజకుమారి, రమాదేవి, ఎస్‌కె. రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- భద్రాద్రి డీఎంహెచ్‌వో రాథోడ్ తుకారాం

బూర్గంపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాథోడ్ తుకారాం సూచించారు. మండల పరిధిలోని మోరంపల్లిబంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణను, రికార్డులను, ఆపరేషన్ గదిని, పార్మసీని, ల్యాబ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడు తూ వైద్యసిబ్బంది సమయనపాలన పాటించాలని ఎన్‌సీడీ కార్యక్రమాలు, ఎన్‌సీడీ స్ర్కీనింగ్ తప్పనిసరిగా ప్రతి ఏఎన్ఎం ఎంఎల్‌హెచ్‌పీల సమన్వయంతో ప్రతి ఒక్కరు ఐదు నుంచి పది మందిని ప్రతి రోజు స్ర్కీనింగ్ చేయాలని అన్నారు. తప్పనిసరిగా ఎన్‌సీడీ క్యాంపులు నిర్వహించి స్ర్కీనింగ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు లక్ష్మీసాహితి, ఎన్‌సీడీ పీవో మధువరన్, డాక్టర్ ప్రసాద్ హరికిషన్ పాల్గొన్నారు.

టేకులపల్లి: క్షయ వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్ సూచించారు. గురువారం మండలంలోని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్, ప్రోగ్రాం ఆఫీసర్ సుందర్, సీహెచ్‌వో పార్వతీ, నర్సింగ్ ఆఫీసర్ జగదాంబ, పబ్లిక్ హెల్త్‌నర్స్ ఆఫీసర్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రాథోడ్ తుకారాం

స్త్రీనిధి రుణాలతో ఆర్థిక సాధికారత

- రీజనల్ మేనేజర్ రవీంద్రనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాయక్

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక సాధికారతను కల్పించేందుకు స్త్రీనిధి రుణాలను మంజూరు చేయటం జరుగుతుందని, అందుబాటులోకి వచ్చిన డిజిటల్ చెల్లింపులతో పారదర్శకంగా వాయిదాలు చెల్లింపులు జరుగుతాయని స్త్రీనిధి రీజనల్ మేనేజర్ రవీంద్రనాయక్, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన రిసోర్స్ పర్సన్‌ల సమావేశంలో రీజనల్ మెనేజరు మాట్లాడారు. స్త్రీనిధి రుణాల చెల్లింపులకు డిజిటల్ చెల్లింపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫోన్ పే, పోస్టల్ పే ద్వారా చెల్లింపులు జరిగితే ఆయా మహిళ సంఘం సభ్యురాలి ఖాతాలకు జమ జరుగుతాయన్నారు. పారదర్శిక సేవల కోసం మనస్త్రీనిధి యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని అవగాహన కల్పించారు. మనస్త్రీనిధి యాప్ ద్వారా ఖాతాలను పరిశీలించుకునే అవకాశం, స్టేట్‌మెంట్‌ను తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. డిజిటల్ చెల్లింపులకు ప్రోత్సాహకం ఇస్తామన్నారు. మార్చి లోగా అర్ధ సంవత్సర వాయిదాలు పూర్తి కావాలని సూచించారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ చిలకా ద్రౌపది, స్త్రీనిధి సిబ్బంది ఆనంద్, రమాదేవి పాల్గొన్నారు. స్త్రీనిధి రుణాల బకాయిలు ఎక్కువగా ఉన్న ఆర్పీలను ప్రత్యేకంగా రివ్యూ చేశారు.

సింగరేణిలో జీఎంలు, అడిషనల్ జీఎంల బదిలీలు

కొత్తగూడెం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఇరువురు జీఎంలు, ఇరువురు అడిషనల్ జీఎంలతో పాటు పలువురు డీవైజీఎంలను బదిలీ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి విజిలెన్స్‌లో జీఎంగా విధులు నిర్వహిస్తున్న కె. ప్రసాదరావును కార్పోరేట్ పరిధిలోని స్టోర్స్ జీఎంగా బదిలీ చేయగా, స్టోర్స్ జీఎంగా పనిచేస్తున్న పాలవర్తి ఎలీషాను ఓసీపీ కార్పోరేట్‌కు బదిలీ చేశారు. రామగుండం-2లో అడిషనల్ జీఎంగా పనిచేస్తున్న విజయశేఖరబాబును కార్పోరేట్ ఎస్‌వోటూ డైరెక్టర్ ఈ అండ్ఎంగా, మేయిన్ స్టోర్స్‌లో అడిషనల్ జీఎంగా పనిచేస్తున్న పి. రాజీవ్ కుమార్‌ను విజిలెన్స్ హెచ్‌వోడీగా బదిలీ చేశారు. ఎంవీటీసీ రామగుండంలో డీవైజీఎంగా పనిచేస్తున్న దినీల్ కుమార్‌ను శ్రీరాంపూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలకు, కొత్తగూడెం కార్పోరేట్‌లో ఎన్విరాన్‌మెంట్‌లో డీవైజీఎంగా పనిచేస్తున్న బొల్లం శ్రీనివాస్‌ను ఎస్‌వోటూ జీఎంగా సత్తుపల్లికి, జేకే- 5 ఇల్లెందులో డీవైజీఎంగా పనిచేస్తున్న ప్రసాద్‌రావును ఇల్లెందు ఏరియా సేఫ్టీ అధికారిగా, ఇల్లెందు సేఫ్టీ అధికారిగా పనిచేస్తున్న నజీర్ హుస్సేన్‌ను ఇల్లెందులోని జెకె ఓసికి, కొత్తగూడెం ఏరియా ఎన్విరాన్‌మెంట్‌లో సూపరెంటెండెంట్ ఆఫ్ మైన్స్‌లో పనిచేస్తున్న తోట సత్యనారాయణను సత్తుపల్లి ఏరియాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

25 వరకు జీఎన్ఎం నర్సింగ్ కోర్సుకు గడువు

చుంచుపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో జీఎన్ఎం నర్సింగ్ కోర్సును చదివేందుకు ఈ నెల 25 వరకు గడువు పొడిగించడం జరిగిందని డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రానైట్ వ్యర్థాలు వేస్తే రూ.10 వేల జరిమానా

ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మంరూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని రహదారుల వెంట గ్రానైట్ వ్యర్థాలు వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. గ్రానైట్ వ్యర్థాలు రోడ్ల పక్కన వేయడం మూలంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఈ విషయం కలెక్టర్ దృష్టికి చేరిందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. గ్రానైట్ యజమానులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ఆ ప్రకటనలో సూచించారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

» డీఈవో చైతన్య జైనీ



సుబ్లేడులోలో ఔషధ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న డీఈవో

తిరుమలాయపాలెం, నవంబరు20(ఆంధ్రజ్యోతి):నానాటికి పెరిగిపోతున్న కాలుష్య నివారణకు పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని డీఈవో చైతన్య జైనీ కోరారు. గురువారం మండలంలోని పిండిప్రోలులో ప్రభుత్వ జిల్లాపరిసత్ ఉన్నత పాఠశాలలో కౌన్సిలఫర్‌గ్రీన్ రివల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంకుడు గుంతలు , ఔషధ మొక్కల గార్డెన్, తడిచెత్త, పొడిచెత్త వేరుచేసే యూనిట్లు ఆమె ప్రారంభించారు. అభ్యసన ఫలితాలు సాధించి ఉన్నతస్థాయిలో నిలవాలని కోరారు. విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్లాస్టిక్‌వద్దనేది మన నుంచే మొదలు కావాలని, పాఠశాలలనుంచి విద్యార్థులు ఎక్కడికెళ్లినా చేతిసంచివాడాలన్నారు. విద్యార్థులకు స్టీల్‌వాటర్‌బాటిళ్లు అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే హెచ్‌ఎంలు కూడా గుడ్డసంచులు కొనివ్వాలన్నారు. మథర్‌ట్రీకి పూజలుచేసి ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో సీజీఆర్ చైర్మన్ లక్ష్మారెడ్డి, కో ఆర్డినేటర్ వెంకటరెడ్డి, ఎంఈవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కోటేశ్వరావు, పాపారావు పాల్గొన్నారు.

ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్,నవంబరు20(ఆంధ్రజ్యోతి): చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో గెలుపొందిన మున్నూరుకాపు కులస్తులను గురువారం సాయంత్రం త్రీటౌన్ మున్నూరుకాపు సంక్షేమసంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఇదేస్ఫూర్తితో ముందుకు సాగాలని సంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ పిలుపునిచ్చారు.విజయంసాధించినమెంతుల శ్రీశైలం, మలిశెట్టి వెంకన్న, బైరిశెట్టి శ్రీనివాసరావు, యర్రా అప్పారావు,బాసా మల్లిఖార్జున్, జంగిలి రమణ,వాసంశెట్టి రామారావు, మాటేటి కిరణ్, మాటేటి రాకేష్‌ను సన్మానించారు.

నిధుల స్వాహాకు ఎత్తుగడ?

» పదేళ్లనాడు వేసిన రోడ్లకు మరోసారి ప్రతిపాదన
» రూ.4లక్షలు దండుకునే యత్నం
» వేయని సీసీరోడ్లకు నిధుల స్వాహాపై అధికారుల ఆగ్రహం
» అక్రమాలపై ఇంటెలిజెన్స్ ఆరా?



పదేళ్ల కితం వేసిన సీసీ రోడ్డు

ఖమ్మంరూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వేయని రోడ్లకు వేసినట్లుగా చిత్రీకరించి మరీ బిల్లులు డ్రాచేసుకుంటున్నారు అక్రమార్కులు.. అధికారులు అండతో స్థానికనాయకులు కొందరు ఈబరితెగింపునకు పాల్పడుతున్నారు. ఇదీ ఖమ్మం రూరల్ మండలంలో జరుగుతున్న కొత్త పంథా, అంతేకాదు సుమా పది సంత్సరాల కితం వేసిన సీసీరోడ్లకు కూడా తిరిగి అక్కడ రోడ్లు లేవని చెప్పి మరోసారి సీసీ రోడ్లు వేయాలని ప్రతిపాదనలు పంపారు. తద్వారా బిల్లులు స్వాహచేసే పథకం కూడా రూరల్ మండలంలో సాగుతుందన్న ఆరోపనలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని ఎం.వెంకటాయపాలెంలో పదేళ్ల క్రితం ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్లు వేధారు. 2024-2025 ఏడాదికి సంబందించి ఉపాధిపథకం కింద గ్రామానికి రూ.కోటినిధులతో 26రోడ్లు మంజూరయ్యాయి. ఈనేపథ్యంలో పదేళ్లక్రితం వేసిన రోడ్ల ప్రదేశంలోనే తిరిగి రెండు చోట్ల సీసీరోడ్లు వేయాలని సుమారు రూ.4లక్షలు మంజురు చేయించినట్లు విశ్వసనీయసమాచారం. కొత్తగా ఎంబీలు చేసి నిధులు స్వాహ చేయాలని వ్యూహం రచించినట్లు సమాచారం. ఈ తతంగం అంతా పంచాయతీరాజ్ అధికారుల కనుసన్నల్లోనే జరిగిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఎంబీ రికార్డులపై అధికారుల ఆగ్రహం?

వేయని రోడ్లకు వేసినట్లు ఎంబీ రికార్డు చేసి నిధులు స్వాహ అనే కథనం గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ కథనం ఎం.వెంకటాయపాలెంతో పాటు మండలంలో చర్చనీయాంశమైంది. ఈ కథనంతో మరో రెండు రోడ్లు వేయకుండానే వేసినట్లు నిధులు స్వాహ చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చాయి. ఆంధ్రజ్యోతి కథనానికి పంచాయతీ రాజ్ జిల్లా ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సీసీ రోడ్డు మంజురు ఒక చోట ఉంటే.. మరోచోట రోడ్డు వేశామని చెప్పడం ఏమిటని ఉన్నతాధికారులు మండల అధికారులను ప్రశ్నించినట్లు విశ్వసనీయ సమాచారం. రోడ్లు ఎక్కడ నుంచి ఎక్కడి వరకు మంజురు అయితే అక్కడే పని చేసి ఎంబీరికార్డు చేయాల్సి ఉంటుందని చెప్పారు. అలాంటి వేరే దగ్గర చేసి నిధులు డ్రా చేయడం ఏమిటని అధికారుల ప్రశ్నించినట్లు తెలిసింది. ఇంటిలిజెన్స్ అధికారులు గ్రామంలో ఆరా తీసినట్లు తెలిసింది.

రెండు రోడ్లను సవరణ చేశాం..
పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్

ఎం.వెంకటాయపాలెంలో గతంలో వేసిన సీసీ రోడ్లపైనే రూ.4లక్షలతో తిరిగి రెండు రోడ్లు మంజురు అయిన విషయం వాస్తవమే. అయితే అక్కడ సీసీ రోడ్లు వేసి ఉన్న విషయం తెలిసిన వెంటనే వాటిని సవరణ చేసి వేరేచోటకు మార్చాం. వాటికి సంబందించిన పనులు కూడా ప్రారంభం అవుతున్నాయి.

ఇక కేఎంసీకి ఇద్దరు ఆర్వోలు

మేనేజర్‌గా శ్రీనివాసరావు

ఖమ్మంకార్పొరేషన్,నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో గతంలో ఒకే రెవెన్యూ ఆఫీసర్ బాధ్యతలు నిర్వహించగా ఇక మీదట ఇద్దరు రెవెన్యూ ఆఫీసర్లు సేవలందించనున్నారు. తద్వారా పౌరసేవలతో పాటుగా ఆదాయ వసూళ్ల శరవేగంగా జరగనున్నాయి. ఇతర మునిసిపాలిటీల నుంచి ఇటీవల కేఎంసీకి వచ్చిన అధికారులకు గురువారం నియామక ఆదేశాలు జారీ చేశారు. గతంలో రెవెన్యూ ఆఫీసర్‌గా పని చేసిన జీ.శ్రీనివాసరావుకు కేఎంసీ మేనేజరును నియమించారు. గతంలో ఆర్ఐగా బాధ్యతలు నిర్వహించిన ఏ.సుధాకర్‌కు ఆర్వో బాధ్యతలు కేటాయించారు. నూతనంగా బదిలీపై వచ్చిన కే.వెంకటలక్ష్మీ ఆర్వోగానియామకం చేశారు. నగరంలోని 60డివిజన్లుండగా వాటిలో 20 రెవెన్యూ బ్లాక్‌లు ఉన్నాయి. ఇద్దరు ఆర్వోలకు చేరో పది రెవెన్యూ బ్లాక్‌లను కమిషనర్ అగస్త్య కేటాయించారు.

ఆర్వో సుధాకర్ పరిధిలో..

5,6,10,11,13,14,16,17,19,20 రెవెన్యూ డివిజన్లు కేటాయించారు.

కే.వెంకటలక్ష్మీ పరిధిలో..

1,2,3,4,7,8,9,12,15,18 రెవెన్యూ బ్లాక్‌కు కేటాయించారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అచ్చయ్య



మాట్లాడుతున్న అచ్చయ్య

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరిత్యాలతో రైతులు చేతికి వచ్చిన పంటలు తీవ్రంగా దెబ్బతిని తీవ్రఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం అకాల వర్షంతో నష్టపోయిన బాధిత రైతుల్ని ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. గురువారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షంతో పత్తితో పాటుగా ఇతర పంటలు తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తిని గిట్టుబాటు ధరకి కొనుగోలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి విపత్తుగా గుర్తించి పత్తి కొనుగోలులో నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు. రైతులకు రెండో విడత రైతు భరోసాను విడుదల చేయాలన్నారు. రైతులు, ప్రజల సమస్యలపై ఈనెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయాలు ముట్టడి కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఆర్ శివలింగం, కోల్లేటి నాగేశ్వరరావు, జీ.రామయ్య,సీవై పుల్లయ్య, బందెల వెంకయ్య, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి బ్యాంకులో ఘనంగా సహకార వారోత్సవాలు

» చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి



మాట్లాడుతున్న చెరుకూరి కృష్ణమూర్తి

ఖమ్మంమార్కెట్,నవంబరు20(ఆంధ్రజ్యోతి): నగరంలోని భద్రాద్రి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సహకార వారోత్సవాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అధ్యక్షన ప్రపంచ పోటీతత్వం కోసం సహకార వ్యాపార నమూనాలలో ఆవిష్కరణఅనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాని ముఖ్యఅతిథులుగా జిల్లా సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ఉషశ్రీ, శృతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఒకరినొకరు సహకారం చేసుకుంటూ అందరూ కలిపి సమాజానికి సహకరిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడటమే సహకార వ్యవస్థ మూల సూత్రం అన్నారు. 28సంత్సరాల క్రితం భద్రాద్రి బ్యాంకు ను ఖమ్మంలో ఒక్క శాఖగా ప్రారంభించి అంచలచ్చలుగా ఎదిగి నేటికి 23 శాఖలు విరాజిల్లుతుందని ఇది సభ్యులందరి సహకారంతో సాధ్యమైందన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ఉషశ్రీ, శృతి మాట్లాడుతూ ఇప్పుడు మనం డిజిటల్ యుగంలో ఉన్నామని, బ్యాంకులకు వెళ్లి నిలబడి వారి లావాదేవీలను పూర్తిచేసుకొనే అవసరం లేకుండా క్షణాల్లో వారి ఆర్థిక లావాదేవీలను పూర్తి చేసుకుంటున్నామని ఇదంతా అన్నిరంగాల్లో వస్తున్న సాంకేతిక విప్లవమేననిఅన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వాణాధికారి దాసరి వేణుగోపాల్, రిజర్వ్‌బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ తేజాడిప్త బెహరా, బ్యాంకు డైరెక్టర్ ఆర్.పి.చన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT MAHABUBABAD

O.S No. 169 Of 2024

Inukulla Umamaheshwar Rao S/o. Rammurthy Aged about 57 Years, Occu:Business R/o. H.No: 1-5-74, Station Road, Mahabubabad Town & District.

...Petitioner/Plaintiff

And

Perumalla Srinivas Rao, S/o. Nageshwar Rao, Aged About 55 Years, Occu: Business R/o. C/o. Sowbhagya Cloth Stores Kasba Bazar, Khammam Town & District

...Respondents/Defendants

Notice

Please Take Notice that the Above suit filed by the Plaintiff Against you suit for Recovery of money is posted for your appearance on **08-12-2025 at 10:30 am** you may therefore, appear on the above date in person or through an Advocate duly instructed without fail, if you fail to appear the suit will be heard and decided as exparty.

Sd/- KESHAVA RAO KONDAPALLY B.A.LL.B.
Advocate
H.No: 1-3-84, Near Venugopala Swamy Temple, Old Abadi, Mahabubabad. Cell.No 9441200610

భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి



పూజలో పాల్గొన్న ఏసీ వీరస్వామి

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా నగరంలోని భ్రమరాంబ సమేత గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో గురువారం కనులపండువగా పూర్ణాహుతి నిర్వహించారు.ఆలయ అర్చకులు దామూలూరి వీరభద్రవర్మ, కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి నిర్వహించారు. దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి పూర్ణాహుతిలో పాల్గొన్నారు. శుక్రవారం ఆలయంలో కుంకుమపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

నేటితో ముగిసిన కార్తీక మాస పూజలు

కార్తీకమాస పూజలు శుక్రవారం తెల్లవారుజామున పాడ్యమీ ఓత్తులు వెలిగించిన అనంతరం కార్తీకమాస పూజలూ పూర్తి కానున్నాయి. ప్యాడమీ ఓత్తుల, అరటి దొబ్బలు, పూజాసామాగ్రి కొనుగోళ్లతో గురువారం మార్కెట్ సందడిగా మారింది. నగరంలోని సర్థార్‌పటేల్ స్టేడియం, పెవిలియన్ గ్రౌండ్, తదితర ప్రాంతాలలో మహిళలు పూజా సామగ్రి కొనుగోళ్ల చేశారు.

హోంగార్డుల ఆరోగ్య బీమాపై అవగాహన

ఖమ్మంక్రైం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): హోంగార్డు ఉద్యోగుల ఆరోగ్యబీమా పథకంపై నగరంలోని పోలీసుకల్యాణ మండపంలో బ్యాంకు అధికారులు గురువారం అవగాహనసదస్సునిర్వహించారు.యాక్సిస్ బ్యాంక్, బజాజ్ అలియాన్జ్ భాగస్వామ్యంలో తక్కువ ధరలో రూ.33లక్షల ఆరోగ్యబీమాపథకం ద్వారా హోం గార్డులు పొందే ప్రయోజనాలపై వివరించారు.ఈకార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీ సుశీల్‌సింగ్, నరసయ్య, ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన 'చాంబర్' కార్యవర్గ సభ్యులు



ఖమ్మంమార్కెట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరావును గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి జీవై నరేష్‌తో పాటు, ఉపాధ్యక్షుడు బత్తిన నర్సింహరావు, ట్రెజరర్ తల్లాడ రమేష్ మంత్రి ఆశీర్వాదం తీసుకున్నారు. తుమ్మల వారిని శాలువాతో సత్కరించారు.

పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి: డీపీఆర్వో గౌస్



సర్టిఫికెట్లు అందిస్తున్న డీపీఆర్వో

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో పుస్తక పఠనం ఆసక్తి నెలకొల్పాలని డీపీఆర్వో ఎం.ఏ. గౌస్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. పుస్తకాలు చదవడం వల్ల వ్యక్తిత్వం పెరుగుతుందని, చిన్నతనం నుంచే పిల్లల్లో పుస్తక పఠనం అలవాటు పెంచాలని అన్నారు. గ్రంథాలయంలో ఉద్యోగార్థులకు అవసరమైన అన్నిపుస్తకాలు ఏర్పాటు చేశామని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని సూచించారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కటుకోజ్వుల రమేష్ రచించిన మరో గ్రంథాలయ ఉద్యమం కవితను డీపీఆర్వో ఆవిష్కరించారు. జిల్లాగ్రంథాలయసంస్థ కార్యదర్శి కె. కరుణకుమారి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘంనాయకులు, ఉద్యోగులు జె.భాస్కర్,సీహెచ్.శ్రీనివాస్, వి.అఖిల్, ఎం.రోహిత్,ఎస్.లలిత కుమారి, కె.విజయకుమారి, బి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

కొమ్మినేపల్లి హైస్కూల్‌లో కేజీబీవీ జాయింట్ డైరెక్టర్ తనిఖీ

కామేపల్లి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొమ్మినేపల్లి హైస్కూల్‌ను రాష్ట్ర కేజీబీవి డైరెక్టర్ శ్రీనివాసచారి తనిఖీ చేశారు. పాఠశాల పరిశుభ్రత, ప్రత్యేక కార్యక్రమ ప్రణాళికలో చేసిన పనులను పరిశీలించారు. అనంతరం టింకరింగ్ ల్యాబ్‌లో ఆరోతరగతి పిల్లలు కనబరిచిన ఇటో ట్రాయింగ్ ప్రదర్శనను మెచ్చుకున్నారు. ఈ పరిశీలనలో జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ ప్రవీణ్, హెచ్ఎం పి.జ్యోతి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్కేటింగ్‌కు 'హార్వెస్ట్' విద్యార్థిని



ఖమ్మంస్పోర్ట్స్,నవంబరు20(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో జరగనున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు తమ కళాశాల ఇంటర్ విద్యార్థిని లావణ్యప్రహర్ష ఎంపికైనట్లు హార్వెస్టు కళాశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ రవిమారుత్ తెలిపాడు. లావణ్య ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైందని తెలిపారు.



తూకంలో మోసాలపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ఖమ్మంఅర్బన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): రిమోట్‌కంట్రోల్‌తో తూకంలో రైతులను మోసం చేస్తున్న దళారులపై పీడీయాక్ట్‌నమోదు చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబులు డిమాండ్ చేశారు. రైతు సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పంటల దిగుబడి తగ్గి రైతులు నష్ట పోయి ఉండగా దళారులు పంటల కొనుగోలు సమయంలో మరో విధంగా అన్యాయానికి గురి చేస్తున్నారన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే మీరాసాహెబ్, వాసిరెడ్డి ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు కుసుమూడిమధు, తదితరులు పాల్గొన్నారు.

సైడ్ కాలువల నిర్మాణాన్ని చేపట్టాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు యర్రా

ఖమ్మంఅర్బన్,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బొక్కలగడ్డ, మంచి కంటి నగర్‌లో సైడు కాలువలు వెంటనే నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు యర్రా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం 47వ డివిజన్‌లోని బొక్కలగడ్డప్రాంతాన్ని సందర్శించారు. నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంట్రాక్టరు నిర్లక్ష్యం కారణంగాపనులు మొదలు కాలేదన్నారు. తీగల వంతెన కోసం సైడు కాలువలు తీసినప్పటికీ వాటిని నిర్మించకపోవటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారని అన్నారు. నగరంలో సకాలంలో విస్తరణ పూర్తి చేయటంతోపాటు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం త్రీటౌన్ కార్యదర్శి భుక్యా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఎర్రాగోపీ, ఎల్లంపల్లి వెంకటరావు, హిమాం, ఖాసీం, పాషా,జానీ పాల్గొన్నారు.

అన్నదానం మహాభాగ్యం: ఎంపీ వద్దిరాజు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వాములకు 41రోజులపాటు అన్నదానం నిర్వహించడం మహాభాగ్యం అని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. గురువారం నగరంలోని శ్రీ దివ్యమణికంఠ అన్నదాన సేవాసమితి ట్రస్టు ఆధ్వర్యంలోఅయ్యప్ప స్వాములకు 41రోజులు పాటునిర్వహిస్తున్న అన్నదాన మండపాన్ని సందర్శించారు. అన్నదాన కార్యక్రమానికి 20 క్వింటాళ్ల బియ్యాన్ని విరాళంగాప్రకటించారు. ఈ కార్యక్రమంలో దివ్యమణికంఠ అన్నదాన సేవాసమితి ట్రస్టుచైర్మన్ చిర్ర రవి, సెక్రటరి పుట్ట మల్లిఖార్జున్, సామినేని రవి, నిడిగొండ శేఖర్, తేజ, కిషన్, ఉపేందర్ పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు రూ.12వేల సహాయం అందించాలి

నేలకొండపల్లి,నవంబరు20(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ హామీ ఇచ్చిన విధంగా భూమి లేని వ్యవసాయ కూలీలకు రూ.12వేలను అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాఅధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం డివిజన్ అధ్యక్షుడు కేవీ రామిరెడ్డి అధ్యక్షతన నేలకొండపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా గురవయ్య



జ్యోతి, గురవయ్య

నేలకొండపల్లి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా మండ్రాజుపల్లి పీఎస్‌లో పని చేస్తున్న తొర్తి గురవయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నేలకొండపల్లిలో జరిగిన మండలసభలో ఈఎన్నిక జరిగింది. అధ్యక్షురాలిగా పీఎస్ రాజేశ్వరపురంలో పని చేస్తున్న జె.జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా తొర్తి గురవయ్య, ఉపాధ్యక్షుడిగా పీఎస్ తిరుమలాపురంలో పని చేస్తున్న కె.వెంకటరమణ, కోశాధికారిగా టి.కోటేశ్వరరావు, కార్యదర్శులుగా మురళి, అరుణ, ప్రతిమ, శ్రీనివాసరావు, షరీఫ్, ఉపేందర్, నాగార్జున ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు, రావెళ్ళ అరవిందకుమార్, మందడపు శ్రీనివాసరావు, ఉసిరికాయల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు20(ఆంధ్రజ్యోతి):నగరంలోని టేకులపల్లి డైట్‌కళాశాలలో ఖాళీగా ఉన్న రెండు అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులను ఈనెల 22నుంచి 29లోగా డైట్ కళాశాలలో అందించాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు, పదవీ విరమణ చేసిన వారు, 65సంవత్సరాలలోపు వారు, అర్హులైన అధ్యాపకులు దరఖాస్తులు అందించాలని తెలిపారు. సైన్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సబ్జెక్టులకు ఆసక్తి గల వారు దరఖాస్తులు అందించాల, ఎంఎడ్, బీఎడ్ అర్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

IN THE COURT OF THE II ADDL DISTRICT JUDGE: AT KHAMMAM

E.P. No. 28 of 2021 IN O.S. No. 142 of 2017

Between:

Pothineni Bhumeswara Rao, S/o. Kondaiah, Age: 49years, Occu: Business & Agriculture, R/o. H.No. 5-311/1, Near Century School, Wyra Road, Khammam City and District.

...D.Hr/Plaintiff

and

Vasireddy Chandrasekhar, S/o. Satyanarayana, Age: 57years, Occu: Business, R/o. Vatsavai Road, Bonakal village and Mandal, Khammam District.

...J.Dr/Defendant

AUCTION NOTICE

To, The General Public That in the above said E.P. is filed by the D.Hr for recovery of E.P. amount against the J.Dr, as the J.Dr failed to pay the balance E.P. amount to the D.Hr, as such the Hon'ble Court was pleased to Ordered to sell the below mentioned Schedule Property of the J.Dr., in the Public auction, which will be held on: 06-12-2025, at 10:30 A.M.

Anybody is interested to purchase the below mentioned Schedule Property may participate in the public auction, which will be held on: 06-12-2025, at the premises of the Hon'ble II.ADDL DIST JUDGE, At Khammam and purchase the property, as per the conditions of the Hon'ble Court.

DESCRIPTION OF THE E.P. SCHEDULE PROPERTY

The land measuring to an extant of Ac.1-10gts in and out of survey no. 140/A and Ac.0-33gts in and out of survey no. 141/E, total extent of Ac.2-03gts in one compact block along with Sri Chaithanya School (Presently Shine school) building situated at Ravinoothala village, Bonakal Mandal, Khammam district, within the following boundaries: **North:** Land of Sri Dharavath Sadhu, **South** : Land of Sri Macha Ramulu, **East** : Land of Sri. Sadineni Uma Maheswara Rao, **West** :Land of Sri Krishna

D.Hr Value of Rs.68,00,000/-

// BY ORDER OF THE HON'BLE COURT //

Sd/- CHINTHANIPPU VENKATESWAR RAO
Advocate, Khammam

రాష్ట్రస్థాయి ఖోఖోకు మధిర విద్యార్థులు



మధిర రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 69వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా అండర్-17 విభాగంలో కల్లూరులో జరిగిన ఖోఖో పోటీల్లో మధిర మైనార్టీ గురుకుల విద్యార్థులు తమ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు షేక్.జావెద్, బి.నర్సింహులు ఎంపికైన వారిలో ఉన్నారు. అలాగే హరికిరణ్ అనే విద్యార్థి స్టాండ్ బైగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ షేక్.షమీన్, అధ్యాపకులు అభినందించారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు

మధిర రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు నుంచి ఖమ్మంపాడు మీదుగా చిలుకూరు వరకు గల ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో అటువైపు వెళ్లే ప్రజలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ఈ రహదారిలో ఖమ్మంపాడు గ్రామంలోని వీరబ్రహ్మంస్వామి దేవాలయం వరకు రోడ్డు అంతా సైడ్‌బరమ్స్ దెబ్బతిన్నాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిలో చిలుకూరు వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ రహదారి గుండా ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చిలుకూరు గ్రామం ఆంధ్రా-తెలంగాణ సరిహద్దులో ఉంటుంది. అయితే ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని, డబుల్‌రోడ్డుగా విస్తరణ చేయాలని ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ రహదారిని డబుల్‌రోడ్డు చేసి అభివృద్ధిపర్చాలని ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాల ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న దెందుకూరు-చిలుకూరు బీటీ రోడ్డు

పెనుబల్లిలో తాత్కాలిక మరమ్మతులు

పెనుబల్లి: ముత్తగూడెం నుంచి లంకాసాగర్ వరకు ఏడేళ్ల క్రితం రహదారికి నిధులు మంజూరయ్యాయి. మూడేళ్ల క్రితం కొంతమేరకు పనిచేసిన కాంట్రాక్టర్ ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని గత ప్రభుత్వ హయాంలోనే పనులు నిలిపివేశారు. అర్థాంతరంగా నిల్చిపోగా ఈ రహదారిపై నిత్యం గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు సంబంధించిన టిప్పర్లు, లారీల రాకపోకలు జరుగుతుండడంతో రోడ్డు మరీ అధ్వానంగా తయారయ్యింది. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేఎం బంజర్, మర్లకుంట తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే మట్టా రాగమయి, ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుకు మరమ్మతులు చేయాలని విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రాగమయి తాత్కాలిక మరమ్మతులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తాత్కాలిక మరమ్మతులు చేస్తుండడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తాత్కాలిక మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిలో..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మునిసిపాలిటీలోని జాతీయ రహదారిపై గొయ్యి ప్రమాదకరంగా మారింది. పట్టణంలోని సెంట్రల్ డివైడర్‌పై ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన లాలీపప్ (యాడ్స్ లైటింగ్) బోర్డులకు విద్యుత్ కనెక్షన్ కోసం పాతసెంటర్‌లోని సురేష్ టెంట్‌హౌస్ వద్ద బీటీ రోడ్డును అడ్డంగా తవ్వేశారు. అయితే విద్యుత్ కోసం లైన్ తీసిన తర్వాత అక్కడ బీటీతో పూడ్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు. ఇదే విధంగా డివైడర్ టూ డివైడర్ మధ్యలో యూటర్న్‌ల వద్ద తవ్వి అస్తవ్యస్తంగా పూడ్చగా సురేష్ టెంట్ హౌస్ వద్ద మాత్రం ప్రమాదకరంగా ఉంది. ఇలా జరిగిన నెలలు కావస్తున్నా ఇంకా పూడ్చకపోవడంతో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని మునిసిపల్ కమిషనర్ కొంద్రా నరసింహ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే బీటీ వేయిస్తామని వివరణ ఇచ్చారు. డోజర్‌తో చదును చేయించి మరలా మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



జాతీయ రహదారిపై ఏర్పడిన గొయ్యి

రేపు వైరాలో డిప్యూటీ సీఎం పర్యటన

▸▸ ఇంటిగ్రేటెడ్ స్కూల్, సబ్‌స్టేషన్లకు శంకుస్థాపనలు

వైరా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వైరా మండలంలో పర్యటిస్తారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి తెలిపారు. 22వతేదీ ఉదయం 10.45గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైరాలో డిప్యూటీ సీఎం పర్యటన కొనసాగుతుందని పేర్కొన్నారు. రూ.200కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్‌కు అతర్వాత వైరా, స్నానాల లక్ష్మీపురం, రెబ్బవరంల్లో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు భట్టి విక్రమార్క శంకుస్థాపనలు చేస్తారని వివరించారు. మధ్యాహ్నం 1నుంచి 2గంటల వరకు వైరాలోనే ఉండి ఆతర్వాత బోనకల్ పర్యటనకు వెళ్తారని చెప్పారు. భట్టి విక్రమార్క పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

బోనకల్‌లోనూ..

బోనకల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదిన బోనకల్‌కు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటనా షెడ్యూల్ ఖరారైంది. బోనకల్ గ్రామానికి మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటారు. ఇందిరా డెయిరీ నిర్మాణ స్థలానికి చుట్టూ నిర్మించనున్న ప్రహారి పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. పాడి రైతుల అభివృద్ధి కొరకు దాదాపు 9 ఎకరాల భూమిని కేటాయించారు. ఇట్టి భూమిలో పనులు చేపట్టేందుకు ముందుగా ప్రహారిని నిర్మించనున్నారు. ఇప్పటికే ఇందిరా డెయిరీ నిర్మాణ స్థలానికి చేరుకునేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి రోడ్లు వేసేందుకు నిధులను మంజూరు చేశారు. పర్యటన నేపథ్యంలో ఐకేపీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇంటి పన్ను వసూళ్లలో వేగం పెంచాలి

కారేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంచాయతీలలో కార్యదర్శులు గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, ఇంటి పన్ను వసూళ్ళలో వేగంపెంచాల్సిన అవసరం కార్యదర్శులపై ఉందని ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్ సూచించారు. గురువారం మండలపరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ.. ట్రేడింగ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేయిస్తు పంచాయతీలలోని సైడుకాల్వలను శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పంచాయతీలలోని ట్రాక్టర్లను గ్రామంలో తిప్పాలని, చెత్తచెదారం సేకరించి డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు. చాలమంది కార్యదర్శులు ఇంటి పన్నువసూళ్ళలో మందంజలో ఉన్నారని,కొంతమంది నామ మాత్రంగా వసుళ్ళుచేస్తున్నారని, వారు కూడా వసూళ్ళలో వేగంపెంచాలని అధికారులు తెలిపారు.

మేడేపల్లి సొసైటీ చైర్మన్‌కు సన్మానం

ముదిగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మేడేపల్లి సొసైటీ చైర్మన్ సామినేని వెంకటేశ్వరరావును గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ సహకార సంఘం యూనియన్ ఈనెల 14నుంచి 20వతేదీవరకు నిర్వహించిన 72 వారోత్సవాల్లో భాగంగా ఆయనను సన్మానించారు. సామినేని వెంకటేశ్వరరావు మేడేపల్లి సొసైటీ చైర్మన్‌గా గత 25సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఐదు దఫాలుగా కూడా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆయనను ప్రశంసా పత్రం, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రశంసించారు.



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

మేడ భూషయ్యకు పలువురి నివాళి



నివాళులర్పిస్తున్న బాగం హేమంతరావు

ఏన్కూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరుకు చెందిన సీపీఐ సీనియర్‌నేత మేడా భూషయ్య (80) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఏన్కూరులో గురువారం జరిగిన అంత్యక్రియలకు సీపీఐ పార్టీనాయకులు హాజరై మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో సీపీఐ పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గసభ్యుడు యర్రాబాబు, మండల కార్యదర్శి జాగర్లముడి రంజిత్‌కుమార్, జిల్లానాయకులు అమరనేని వీరభద్రం, మండల సహాయ కార్యదర్శి బానోతు రాంబాబు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం సందర్శన

మధిర రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు కనకదుర్గా జిన్నింగ్ మిల్లు వద్ద పత్తి కొనుగోలు కేంద్రాన్ని గురువారం మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు సందర్శించారు. కేంద్రానికి పత్తి తీసుకువచ్చిన రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు.

వేబ్రిడ్జి తూకంలో వ్యత్యాసం

తల్లాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నూతన్‌కల్ గ్రామంలోని శివశక్తి వేబ్రిడ్జి ధాన్యం తూకంలో వ్యత్యాసంతో రైతులు నష్టపోతున్నారు. గురువారం వేబ్రిడ్జిని రైతుసంఘం నాయకులు పరిశీలించి తూకంలో వ్యత్యాసాన్ని బయటపెట్టారు. ఈసందర్భంగా రైతుసంఘం జిల్లా నాయకుడు శీలం సత్యానారాయణరెడ్డి మాట్లాడుతూ.. నూతనకల్‌లోని శివశక్తి వేబ్రిడ్జిలో ఒక్కొక్క లారీకి క్వింటాళ్ల తేడా వస్తుందన్నారు. మండలంలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన రైతుల ధాన్యాన్ని కాటా వేసి పంపిన లారీని వేబ్రిడ్జిపై పరిశీలించగా 10క్వింటాళ్ల తక్కువగా చూపిస్తూ తేడా వచ్చిందని, అదే లారీనీ తల్లాడలో ఉన్న మరో రెండు వేబ్రిడ్జిలలో కాటావేస్తే సరిపోయిందని వివరించారు. శివశక్తి వేబ్రిడ్జి తూకంలో తేడావల్ల అనేక మంది రైతులు నష్టపోతున్నారని, తూనికలు కొలతల శాఖల అధికారులు తక్షణమే పరిశీలించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తల్లాడ మండల అధ్యక్షుడు కళ్యాణపు కృష్ణయ్య, వీరయ్య, పోతురాజు కోటయ్య, పామర్తిసత్యం, వెంకటేశ్వరరెడ్డి, ఎక్కిరాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైరా ఆసుపత్రికి నిధుల మంజూరు

వైరా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పోరాట ఫలితంగా వైరాలోని ఏరియా ఆసుపత్రికి రూ.16లక్షల మెడికల్ బడ్జెట్ నిధులు విడుదలయ్యాయని ఆపార్టీ డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు తెలిపారు. ఇటీవల ఏరియా ఆసుపత్రిలోని సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే చేసి ఆందోళన చేసిన ఫలితంగానే వెంటనే నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. నిరంతరం ఈ ఆసుపత్రిలోని సమస్యలపై సీపీఎం దృష్టిసారించి వాటి పరిష్కారానికి ఆందోళన చేస్తామని ఆయన తెలిపారు.

కారేపల్లి మోడల్ స్కూల్లో తనిఖీలు

కారేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో రాష్ట్ర తనిఖీ కమిటీ బృందం గురువారం తనిఖీలు చేశారు. రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో పాఠశాలలోనే లైబ్రరీ, టాయిలెట్స్, స్పోర్ట్స్‌రూమ్, కిచెన్, స్టోర్ రూం, హాస్టల్, పాఠశాల గ్రౌండ్‌ను పరిశీలించారు. ఎంఈవో జయరాజు, కమ్యూనిటి మోబిలైజేషన్ అధికారి ప్రవీణ్, ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



కారేపల్లి కేంద్రంలో విద్యుత్‌కు అంతరాయం

కారేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సహకార సొసైటి కార్యాలయం వద్ద లారీ ఢీకొని విద్యుత్ స్తంభం విరిగింది. విరిగిపోయిన స్తంభం స్థానంలో మరో నూతన స్తంభం ఏర్పాటు చేయాల్సిన అధికారులు సాయంత్రం అయిన పట్టించుకోలేదని బస్టాండ్ ప్రాంత వ్యాపారులు ఆరోపించారు. అయితే విరిగిన స్తంభం స్థానంలో అవసరమైనది అందుబాటులో లేదని, మరో ప్రాంతం నుంచి తీసుకరావాల్సి ఉందని విద్యుత్‌శాఖ సిబ్బంది తెలిపారు. పునారవృత్తం కాకుండా చూడలన్నారు.

జమలాపురం ఆలయానికి భక్తుల పాదయాత్ర

కల్లూరు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరువంచ గ్రామం నుంచి గురువారం జమలాపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి మహిళ భక్త బృందం పాదయాత్రగా తరలి వెళ్లారు. జమలాపురంలో వేంచేసి ఉన్న కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం పాదయాత్రతో వెళ్లాలని ఆకాంక్షతో ఈ యాత్ర తలపెట్టామని మహిళ భక్తురాలు ఇనపాల పుల్లమ్మ తెలపింది. పేరువంచ గ్రామంలో ప్రజలు పాడి, పంటలతో విరజిల్లాలని, సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ మధిర సమీపంలో గల జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దర్శనం చేసుకోవటం జరుగుతుందని పాదయాత్రగా వెళుతున్న మహిళ భక్తులు వివరించారు. భక్తుల పాదయాత్ర దిగ్విజయంగా సాగాలని స్థానిక ప్రముఖులు కొండపల్లి వాసు, రాధకృష్ణలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమలో పలువురు భక్తులు పాల్గొన్నారు.



పేరువంచ నుంచి జమలాపురానికి పాదయాత్రగా తరలి వెళుతున్న మహిళ భక్త బృందం

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT MAHABUBABAD

O.S No. 169 Of 2024

Inukulla Umamaheshwar Rao S/o. Rammurthy
Aged about 57 Years, Occu:Business
R/o. H.No: 1-5-74, Station Road,
Mahabubabad Town & District.
...Petitioner/Plaintiff

And

Perumalla Srinivas Rao, S/o. Nageshwar Rao,
Aged About 55 Years, Occu: Business
R/o. C/o. Sowbhagya Cloth Stores
Kasba Bazar, Khammam Town & District
...Respondents/Defendants

Notice

Please Take Notice that the Above suit filed by the Plaintiff Against you suit for Recovery of money is posted for your appearance on **08-12-2025 at 10:30 am** you may therefore, appear on the above date in person or through an Advocate duly instructed without fail, if you fail to appear the suit will be heard and decided as exparty.

Sd/- KESHAVA RAO KONDAPALLY B.A.LL.B.
Advocate
H.No: 1-3-84, Near Venugopala Swamy Temple, Old Abadi,
Mahabubabad. Cell.No 9441200610

నాణ్యమైన గన్నీ సంచులను సరఫరా చేయాలి



ఏఎంసీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వైరా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేసి వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని, నాణ్యమైన గన్నీసంచులు సరఫరా చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వైరా ఏఎంసీలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ కాంటా వేసిన బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని, ప్యాడీ డ్రయర్ ఖర్చులను ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, నాయకులు సుంకర సుధాకర్, గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, హరి వెంకటేశ్వరరావు, పైడిపల్లి సాంబశివరావు, గొల్లపూడి ప్రకాశరావు, కొంగర సుధాకర్, అమరనేని కృష్ణ, సామినేని రవి, బెజవాడ వీరభద్రం, చింతోజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శివాలయంలో ఘనంగా మహా అన్నాభిషేకం

కల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవక్షేత్రం(శివాలయం)లో గురువారం ఘనంగా మహా అన్నాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌తోపాటుగా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డిలు ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని దయానంద్ ప్రారంభించారు. ఆలయ ఈవో ఎస్‌విడీ ప్రసాద్, కల్లూరు తహసీల్దార్, సాంబశివుడు, మునిసిపాలిటీ కమిషనర్ సంపత్‌కుమార్, ఆలయ మాజీ చైర్మన్ మాడిశెట్టి వెంకటేష్, భక్త బృందం తరుపున బుర్రి వీరయ్య, మాడిశెట్టి శ్రీనివాసరావు, కిష్టశెట్టి కొండలు, రాచబంటి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు లక్కినేని రఘు, పెద్దబోయిన నారాయణరావుతో పాటుగా పరిసర గ్రామాలనుంచి వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ప్రముఖులు, భక్తులు

అయ్యప్ప స్వాములకు అన్నదానం

కొణిజర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తనికెళ్ల శివాలయంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మసనం శివరామకృష్ణ దంపతులు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ.. గత ఐదేళ్ల నుంచి తనికెళ్ల శివాలయంలో ప్రతి కార్తీక మాసంలో అయ్యప్పస్వాములకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, ఖమ్మంపట్టణ అధ్యక్షుడు గద్దె వెంకటరామయ్య, అమృతపు మల్లిఖార్జున్, దుస్సా సత్యనారాయణ, కమర్తపు నాగేశ్వరరావు, పిల్లలమర్రి కొండలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శివరామకృష్ణ దంపతులను గురుస్వామి చింతనిప్పు శ్రీనివాస్, పెద్దమళ్ల శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు.



స్వాములకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ కళాశాలను డీఈవో తనిఖీ

కల్లూరు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని ప్రభుత్వ జూనియర్, సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలను గురువారం ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా విద్యాశాఖ అధికారి రవిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను ఆకస్మికంగా తనిఖీ చేసి అధ్యాపకులు విద్యార్థులకు అందిస్తున్న విద్య బోధన తీరుపై పై ఆయన పరిశీలించారు. ఇంకాను విద్యార్థుల హాజరు శాతం, పాత భవనాల మరమ్మత్తుల తీరు గురించి ప్రిన్సిపాల్ షకీలాభానుతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులతో ఎంత సిలబస్ పూర్తి చేశారని, ఎన్ఎస్ఎస్ యూనిట్ కార్యక్రమాలు ఏలా జరుతున్నాయని ప్రోగాం ఆఫీసర్ వీరభద్రరావును ప్రశ్నించారు. ఈ మేరకు కళాశాల తనిఖీ సందర్భంగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ కార్యాలయం తరఫున నాగజ్యోతి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



బోధన గురించి అడిగి తెలుసుకుంటున్న డీఈవో రవిబాబు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా!

HINDUSTAN PETROLEUM CORPORATION LIMITED నందు M/s. Ram HP Gas Gramin Vitrak, Chinthakani (Open Category) వారి డీలర్ షిప్ లో భాగస్వాములుగా ఉన్న శ్రీమతి యస్. కవిత మరియు యస్. వెంకట్రాం గార్ల ఇరువురూ FIRM ను రద్దు చేసుకొని వారి భాగస్వామును కూడా రద్దు చేసుకోవటం జరిగినది. కావున శ్రీమతి యస్. కవిత మరియు యస్. వెంకట్రాం లకు సదరు డీలర్ షిప్ M/s. Ram HP Gas Gramin Vitrak, Chinthakani (Open Category) పై ఇరువురికి ఏవిధమైన లావాదేవీలు లేవని వాటిని పూర్తిగా రద్దు చేసుకోవటం జరిగినది మరియు ఏవిధమైన హక్కులు లేవు.

కావున వీరు ఇరువురితో సదరు FIRM కు ఏవిధమైన లావాదేవీలు జరిపినచో పరిగణలోనికి తీసుకోనబడవు మరియు FIRMకు ఏవిధమైన బాధ్యత లేదని సమస్తప్రజానీకానికి తెలియజేయనైనది.

ఇట్లు
తూము సుదర్శన్ రావు
న్యాయవాది, ఖమ్మం
సెల్: 9848935454

మహిళా సంఘాలకు రూ.1.50కోట్లు అందజేత

ఏన్కూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు ఎస్‌బీఐ బ్రాంచి లింకేజ్ ద్వారా మహిళ స్వయం సహాయక సంఘాలకు రూ.1.50కోట్లు చెక్కులను రీజనల్ మేనేజర్ బి.రాజశేఖర్ అందించారు. గురువారం తూతక్కలింగన్నపేటలో రైతువేదికలో భరతమాత 13 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు చెక్కులను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు అందించిన రుణాలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు. బ్యాంకుల రుణాలను తిరిగి సకాలంలో చెల్లించాలన్నారు. ఆన్‌లైన్,సైబర్‌నేరాలపై అవగహన కలిగించారు. అనంతరం ఏపీఎం శ్యాంకుమార్ మాట్లాడుతూ బ్యాంకులింకేజీ ద్వారా పొందిన రుణాలు సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారావడ్డీలేని రుణాలుపొందవచ్చని తెలిపారు. ఏన్కూరు బ్రాంచి మేనేజర్ బి.జగన్ ఆర్‌బీవో డిప్యూటీ మేనేజర్ సురేష్, ఫీల్డ్ ఆఫీసర్ రాకేష్, సీసీలు జరపల వెంకటేశ్వర్లు, సీహెచ్ నాగమణి, బాలకృష్ణ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బంకా బొందయ్యకు రాయల నివాళి

ముదిగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వెంకటాపురం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బంకా బొందయ్య(65) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. ఆయన భౌతిక కాయానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి, సంతాపం తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, బులెట్‌బాబు, బుచ్చిరామయ్య, రామకృష్ణ, బాలచందర్, శంకరయ్య పాల్గొన్నారు.

IN THE COURT OF THE II ADDL DISTRICT JUDGE: AT KHAMMAM

E.P. No. 28 of 2021 IN O.S. No. 142 of 2017

Between:

Pothineni Bhumeswara Rao, S/o. Kondaiah, Age: 49years, Occu: Business & Agriculture, R/o. H.No. 5-311/1, Near Century School, Wyra Road, Khammam City and District.
...D.Hr/Plaintiff

and

Vasireddy Chandrasekhar, S/o. Satyanarayana, Age: 57years, Occu: Business, R/o. Vatsavai Road, Bonakal village and Mandal, Khammam District.
...J.Dr/Defendant

AUCTION NOTICE

To, The General Public That in the above said E.P. is filed by the D.Hr for recovery of E.P. amount against the J.Dr, as the J.Dr failed to pay the balance E.P. amount to the D.Hr, as such the Hon'ble Court was pleased to Ordered to sell the below mentioned Schedule Property of the J.Dr., in the Public auction, which will be held on: 06-12-2025, at 10:30 A.M.

Anybody is interested to purchase the below mentioned Schedule Property may participate in the public auction, which will be held on: 06-12-2025, at the premises of the Hon'ble II.ADDL DIST JUDGE, At Khammam and purchase the property, as per the conditions of the Hon'ble Court.

DESCRIPTION OF THE E.P. SCHEDULE PROPERTY

The land measuring to an extant of Ac.1-10gts in and out of survey no. 140/A and Ac.0-33gts in and out of survey no. 141/E, total extent of Ac.2-03gts in one compact block along with Sri Chaithanya School (Presently Shine school) building situated at Ravinoothala village, Bonakal Mandal, Khammam district, within the following boundaries: **North:** Land of Sri Dharavath Sadhu, **South** : Land of Sri Macha Ramulu, **East** : Land of Sri. Sadineni Uma Maheswara Rao, **West** :Land of Sri Krishna

D.Hr Value of Rs.68,00,000/-

// BY ORDER OF THE HON'BLE COURT //

Sd/- CHINTHANIPPU VENKATESWAR RAO
Advocate, Khammam

విత్తన కంపెనీలతో అగ్రిమెంట్ చేయించాలి

కల్లూరు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో పత్తి సాగు చేసి నష్టపోయిన రైతులు ప్రత్యామ్నాయంగా మక్కా సాగుపై దృష్టి సారిస్తున్నందున విత్తన కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం అగ్రిమెంట్ చేయించాలని సత్తుపల్లి డివిజన్ సీపీఎం కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి డిమాండు చేశారు. గురువారం కల్లూరులో ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక వర్షపాతం కారణంగా పత్తి పంట దిగుబడి బాగా తగ్గి రైతులు నష్టపోయారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా పత్తి పంట స్థానంలో రైతులు మొక్క జొన్న సాగు వైపు దృష్టి సారించారన్నారు. రాశీ, బేయర్ వంటి అనేక కార్పోరేట్ కంపెనీలు రైతులతో అగ్రిమెంట్ చేయకుండా మొక్క జొన్న విత్తనాలను రైతులు సాగు చేస్తున్నారన్నారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు కంపెనీలతో అగ్రిమెంట్ చేయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. వాస్తవ పరిస్థితులు వ్యసాయశాఖ అధికారులకు తెలిసిన తమకు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కంపెనీలతో అగ్రిమెంట్ చేయమని రైతులు అడిగితే విత్తనాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నరన్నారు. కల్లూరు మండలంలో ఇప్పటికే 200 ఎకరాల్లో మొక్కజొన్న పంట విత్తనాలు వేశారని చెప్పారు. విత్తన కంపెనీలు అగ్రిమెంట్ చేయని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు తన్నీరు కృష్ణార్జునరావు, శీలం పకీరమ్మ, మండల కమిటీ సభ్యులు తన్నీరు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఎం కార్యదర్శి సత్యనారాయణరెడ్డి